

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 08 మే 2021 | సంపుటి : 02 | సంచిక : 297 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## చికిత్సలో రాజీ లేదు

అనంతపురం కోవిడ్ ప్రభావంతో మరణాలు సంభవించడంతో మళ్లీ ఏపీ సిఎం జగన్ ప్రత్యేక చొరవతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని మంత్రి శంకర్ నారాయణ తెలిపారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై అదికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ ... రాష్ట్రంలో కోవిడ్ భాదితుల కోసం ఆరోగ్య శ్రీ పధకం కింద తీసుకొచ్చి వైద్య చికిత్సను అందిస్తున్నామని, కరోనా భారిన పడిన వారికి ఉచితంగా వైద్యాన్ని అందిస్తూ వారికి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వైద్య సేవలను అందించడంలో ఎక్కడా రాజీ లేకుండా మెరుగైన చికిత్సను అందిస్తున్నామని తెలిపారు.

# కొవిషీల్డ్ రెండో డోసు 12 వారాల తర్వాతే..

### పరిశీలిస్తున్న ఎక్స్‌పర్ట్ కమిటీ




న్యూఢిల్లీ: అసలే వ్యాక్సిన్లకు కొరత ఉంది. దీనికితోడు ఎంత ఆలస్యంగా ఇస్తే వ్యాక్సిన్ సామర్థ్యం అంత మెరుగ్గా ఉంటుందని చెబుతున్న అధ్యయనాలు. దీంతో కొవిషీల్డ్ రెండో డోసు తీసుకునే విరామాన్ని మరోసారి పెంచే ఆలోచన చేస్తోంది ఎక్స్‌పర్ట్ కమిటీ. దీనిపై వచ్చే వారం తుది నిర్ణయం తీసుకోనున్నారు. కొవిషీల్డ్ వ్యాక్సిన్ తొలిసారి వచ్చినప్పుడు రెండో డోసును 4 నుంచి 6 వారాల మధ్య తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత గత ఏప్రిల్‌లో ఇది 6-8 వారాల మధ్య అయితే వ్యాక్సిన్ మరింత మెరుగ్గా పని చేస్తుందంటూ కేంద్రం ప్రకటించింది.ఇప్పుడు ఆ సమయాన్ని మరింత పెంచే ఆలోచన చేస్తున్నారు. అదే జరిగితే ప్రస్తుతం ఉన్న వ్యాక్సిన్ కొరత నేపథ్యంలో తయారీదారులపై ఒత్తిడి కాస్తయినా తగ్గే అవకాశం ఉంటుంది. గత మార్చి నెలలో లాన్సెట్‌లో ఓ అధ్యయనాన్ని ప్రచురించారు. దాని ప్రకారం కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను 12 వారాల తర్వాత తీసుకుంటే సామర్థ్యం 81.3 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. అదే ఆరు వారాలలోపు తీసుకుంటే మాత్రం సామర్థ్యం 55.1 శాతంగా మాత్రవే ఉందని పరిశోధకులు వెల్లడించారు.ఇక బ్రిటన్, బ్రెజిల్‌లలో జరిగిన చివరి దశ ట్రయల్స్‌లో వ్యాక్సిన్ సామర్థ్యం 90 శాతం దాకా ఉంటున్నట్లు తేలింది. అయితే అది జరగాలంటే ముందు సగం డోసు ఇచ్చి నెల తర్వాత మొత్తం డోసు ఇవ్వాల్సి ఉంటుందని ఈ ట్రయల్స్ తేల్చాయి. ఇక ఇప్పటికే యూకే, కెనడాలాంటి దేశాలు 12 వారాలు, 16 వారాల తర్వాత రెండో డోసు ఇస్తున్నాయి. రెండో డోసుల మధ్య ఎక్కువ సమయం ఉంటే మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.ఇండియాలోనూ ఇదే అమలు చేస్తే వ్యాక్సిన్ల కొరతను కాస్తయినా అధిగమించే వీలుంటుంది. రెండో డోసు తీసుకునే వాళ్లు మరికొంత ఎక్కువ కాలం వేచి ఉండాల్సి రావడంతో ఆ మేరకు మరికొంత మందికి తొలి డోసు వేసే అవకాశం దక్కుతుంది. ఇలా వ్యాక్సిన్ల కొరతకు కాస్త చెక్ పెట్టవచ్చు. ఎక్కువ గ్యాప్ తర్వాత రెండో డోసు తీసుకుంటే ఎక్కువ రక్షణ ఉండటంతోపాటు ఆ లోపు కనీసం ఒక్క డోసు తీసుకున్న వారు కాస్తయినా సురక్షితంగా ఉంటారు. ఇలా రెండు రకాలుగా ఇది ఉపయోగపడనుంది

# ధాన్యం సేకరణలో మిల్లర్ల ప్రమేయం వద్దు: సీఎం జగన్




### ధాన్యం సేకరణ, రేషన్ బియ్యం డోర్ డెలివరీపై సమీక్ష
### వ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలి
### డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం లేకుండా చూడాలి

అమరావతి: వ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలని, అన్ని అంశాలపై వ్యవసాయ సలహా కమిటీలకు పూర్తి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్రాప్ ప్లానింగ్ మొదలు రైతులకు అండగా ఆ కమిటీలు ఉండాలన్నారు. ఈ ప్రక్రియలో మహిళా రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు. ధాన్యం సేకరణలో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం ఉండొద్దని స్పష్టం చేశారు. ధాన్యం ఏ మిల్లుకు పంపాలన్నది అధికారులే నిర్ణయించాలన్నారు. ఎక్కడా రైతులకు ఏ విధంగానూ నష్టం కలగకూడదని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పక్కాగా ధాన్యం సేకరణ జరగాలని, రేషన్ బియ్యం డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం ఉండొద్దని అధికారులను హెచ్చరించారు. ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో ధాన్యం సేకరణ, రేషన్ బియ్యం డోర్ డెలివరీపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు.ధాన్యం సేకరణలో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం ఉండకూడదు. ఏ ఊరి పంట ఏ మిల్లర్ దగ్గరకు వెళ్తోంది అన్న విషయం అధికారులకు మాత్రమే తెలియాలి. అందుకు అవసరమైతే జిల్లాల కలెక్టర్లు సొంతంగా గోనె సంచులు సేకరించాలి. ధాన్యం కొనుగోలులో తేమ చూడడం కోసం, ఆర్బీకేల వద్ద ఆ మీటర్లు కూడా ఉన్నాయి. మిల్లుల వద్దకు ధాన్యం రవాణా చేయడంలో వ్యయ నియంత్రణ కోసం ఊరికి దగ్గరలోని మిల్లర్ వద్దకు పంపించవద్దు. అందుకోసం జిల్లా యూనిట్‌గా తీసుకుని, ధాన్యాన్ని మిల్లుల దగ్గరకు పంపించాలి. మనం కొనుగోలు చేస్తామని చెప్పిన టైంకు మనమే కొనుగోలు చేయాలి. మొత్తం ప్రక్రియ అంతా కూడా ప్రభుత్వమే చేపట్టాలి. ఆర్బీకేకు సంబంధించి వ్యవసాయ శాఖకు ఎంత బాధ్యత ఉందో, పౌర సరఫరాల శాఖకు కూడా అంతే బాధ్యత ఉంది. కాబట్టి రైతు కోరిన విత్తనాలు పౌర సరఫరాల శాఖ ఇవ్వాలి. అందుకోసం పౌర సరఫరాల శాఖ కూడా ఆర్బీకేను ఓన్ చేసుకోవాలి. రైతులు బయట విత్తనాలు కొని మోసపోకుండా వ్యవసాయ శాఖ చూడాలి. వారికి అవసరమైన విత్తనాలు ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలి. ఈ క్రాపింగ్ నుంచి మార్కెటింగ్ వరకూ రెండూ కలిసి పనిచేయాలివ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలి. ఆ మేరకు ఆ కమిటీలకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి. క్రాప్ ప్లానింగ్ మొదలు ఆ కమిటీలు రైతులకు అండగా నిలవాలి. వ్యవసాయ సలహా కమిటీలు గ్రామాల్లో ఆర్బీకేలతో కలిసి పని చేయాలి. అన్నింటిలోనూ మహిళా రైతుల ప్రమేయం కూడా ఉండాలి. ఆ కమిటీల బాధ్యతలు. వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలి. రాష్ట్ర స్థాయిలో ఈ ప్రక్రియను పౌర సరఫరాల శాఖ మంత్రి పర్యవేక్షిస్తారు. ఎక్కడా రైతు ఇబ్బంది పడకూడదు. ఏ విత్తనం వేస్తే బాగుంటుంది? ఏది సాగు చేస్తే పంట కొనుగోలు చేస్తారన్నది రైతులకు ఆ కమిటీలు ముందే చెప్పాలి. అలాగే రైతులకు ధాన్యంతో తగిన ఆదాయం రాకపోతే (ఉత్పత్తి పెరిగి ధరలు తగ్గడం వంటి కారణాల వల్ల), ఏ పంట వేస్తే తగిన ఆదాయం వస్తుందన్న విషయాన్ని రైతులకు చెప్పాలి. ఆ మేరకు వారికి ప్రత్యామ్నాయం చూపాలి. అంతే తప్ప రైతుల ఆదాయం మాత్రం తగ్గకూడదు.రేషన్ బియ్యం డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం లేకుండా చూడాలి. బియ్యం తీసుకోవడంలో ఎవరూ మిస్ కాకుండా చూడాలి. ఆ మేరకు ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లు పని చేయాలి. ప్రతి నెలా నిర్ణీత వ్యవధిలోగా తప్పనిసరిగా బియ్యం పంపిణీ జరగాలి. కావాల్సినన్ని వేయింగ్ స్కేల్స్ (తూకం యంత్రాలు) కొనుగోలు చేయండి. బియ్యం క్వాలిటీలో ఎక్కడా కూడా కాంప్రమైజ్ అవ్వద్దు, ఎవరైనా ఇంటి వద్ద రేషన్ మిస్ అయితే గ్రామ, వార్డు సచివాలయంలో తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. దీనికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయండి.

# కరోనా వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య శ్రీ పథకం సంజీవనీ



అమరావతి: కరోనా విపత్కర పరిస్థితుల్లో పేదలకు ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఆరోగ్యశ్రీ పథకంతో రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా కరోనా చికిత్సను ప్రభుత్వం కల్పిస్తోంది. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత ఏడాది కరోనా చికిత్సను ఆరోగ్య శ్రీలో చేర్చిన విషయం తెలిసిందే. కాగా గత ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ తో సుమారు ల 11వేల 266 మందికి కరోనా చికిత్సను ఉచితంగా అందించారు. కరోనా ట్రీట్‌మెంట్‌కు ఇప్పటివరకు రూ.332 కోట్ల 41 లక్షలు పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఆంధ్రపదేశ్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కరోనాకు ఉచిత వైద్యం అందిస్తోంది. సీఎం వైఎస్ జగన్ నిర్ణయం పట్ల ఇతర రా(ష్టాల్లోనూ ప్రశంసలు వెలువెత్తుతున్నాయి.

**దక్షిణాదిలో క్రమంగా పెరుగుతున్న కరోనా కేసులు: కేంద్రం**

దేశంలో కరోనా కరాళ నృత్యం చేస్తోంది.రోజు లక్షలాదిగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం దేశం మొత్తంలో 36 లక్షలకుపైగా యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్రం తెలిపింది. కాగా దక్షిణాది రా(ష్టాల్లో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయని కేంద్రం స్పష్టం చేసింది. రా(ష్టాల్లో నెలకొన్న ఆక్సిజన్ సమస్యను ఈనెలాఖరులోగా పరిష్కరిస్తామని తెలిపింది.రా(ష్టాల్లో 70:30 నిష్పత్తిలో సెకండ్, తొలి డోస్ వ్యాక్సినేషన్ ప్రక్రియగా కొనసాగాలని కేంద్రం రా(ష్టాలకు విన్నవించింది.

# ఏపీలో ఉద్యోగుల పనివేళల్లో మార్పు!

అమరావతి: కోవిడ్ కట్టడే లక్ష్యంగా రాష్ట్రంలో కర్ఫ్యూ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ప్రజలు కూడా స్వచ్ఛందంగా కర్ఫ్యూలో పాల్గొంటున్నారు. ఉద్యోగుల దృష్ట్యా ఏపీ ప్రభుత్వం మరో నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల పనివేళలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజున ఉత్తర్వులను జారీ చేసింది. కర్ఫ్యూ నేపథ్యంలో ఉద్యోగుల పనివేళలు ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు ఉండాలని నిర్ణయించింది.రాష్ట్రంలోని అన్ని హెచ్‌డీవో కార్యాలయాలు, సెక్రటేరియట్, జిల్లా కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఈ మేరకు అమలులో రానుంది. మధ్యాహ్నం 12 గంటల తరువాత ఉండాలంటే ఉద్యోగులకు కచ్చితంగా పాసులు కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. కాగా అత్యవసర సర్వీసులకు ఏపీ ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే.

# వరుసగా రెండో రోజూ 4 లక్షలు దాటిన కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తున్నది. దీంతో రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. వరుసగా రెండో రోజూ 4 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. నిన్న 4.12 లక్షల మంది కరోనా బారినపడగా, తాజాగా మరో 4.14 లక్షలకు పైగా మంది పాజిటివ్‌లుగా నిర్ధారణ అయ్యారు. అదేవిధంగా వరుసగా పదో రోజూ మూడు వేలకు కంటె ఎక్కువ మంది మహమ్మారి వల్ల మరణించారు.దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో కొత్తగా 4,14,188 మంది కరోనా బారినపడ్డారు. ఇప్పటివరకు ఒక్క రోజులో ఇంత భారీసంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదవడం ఇదే ప్రథమం. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2,14,91,598కు చేరాయి. ఇందులో 1,76,12,351 మంది బాధితులు కరోనా నుంచి కోలుకున్నారు. మరో 36,45,164 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గురువారం ఉదయం నుంచి ఇప్పటివరకు కొత్తగా 3915 మంది




మరణించడంతో మొత్తం మరణాలు 2,34,083కి పెరిగాయి. ఇక దేశవ్యాప్తంగా కరోనా వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతున్నది. ఇప్పటివరకు 16,49,73,058 మందికి టీకా పంపిణీ చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది.కొత్తగా నమోదైన పాజిటివ్ కేసుల్లో మహారాష్ట్రలో అత్యధికంగా 62,194 కేసులు ఉండగా, కర్ణాటకలో 49,058, కేరళలో 42,464 చొప్పున ఉన్నాయి. ఇక నిన్న మహారాష్ట్రలో 853 మంది మృతిచెందగా, ఉత్తరప్రదేశ్‌లో 350, ఢిల్లీలో 335 మంది బాధితులు చనిపోయారు.దేశవ్యాప్తంగా మొత్తం 29,86,01,699 నమూనాలను పరీక్షించామని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్మార్) ప్రకటించింది. ఇందులో మే 6న 18,26,490 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని వెల్లడించింది.

# తమిళనాడు సీఎంగా ప్రమాణం చేసిన స్టాలిన్



చెన్నై : తమిళనాడు 14వ ముఖ్యమంత్రిగా ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొవిడ్ ప్రొటోకాల్స్ మధ్య ఈ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. స్టాలిన్ అనంతరం 34 మంది మంత్రులు సైతం ప్రమాణం స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు.మక్కల్ నీధి మయ్యం అధినేత కమల్ హాసన్, డీఎంకేకు చెందిన ఎమ్మెల్యేలు, కొందరు కీలక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన వెంటనే కేబినెట్ సమావేశమై.. కరోనా నివారణ చర్యలపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్యే, సినీ నటుడు ఉదయనిధి ప్రత్యేక ఆకర్షణగా నిలువగా.. స్టాలిన్ ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో ఆయన భార్య ఉద్వేగానికి లోనయ్యారు.

# ఏలూరు కార్పొరేషన్ ఎలక్షన్




అమరావతి: ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్‌కు హైకోర్టు అనుమతినిచ్చింది. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఓట్లు లెక్కించాలని సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కాగా మార్చి 10న ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అత్యంత కట్టుదిట్టమైన భద్రత, కోవిడ్ జాగ్రత్తల మధ్య జరిగిన ఈ ఎలక్షన్‌లో 56.86 పోలింగ్

### కౌంటింగ్‌కు హైకోర్టు అనుమతి

నమోదైంది.ఇక ఓటర్ల జాబితాలో తప్పులున్నాయంటూ ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికపై స్టే విధిస్తూ సింగిల్ జడ్జి గతంలో ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు టీవీ అన్నపూర్ణ శేషుకుమారి అనే అభ్యర్థి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం, ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు అనుమతిచ్చి, ఫలితాలను వెల్లడించవద్దంటూ గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, తాజా విచారణలో భాగంగా, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగించవచ్చని పేర్కొంటూ తీర్పునిచ్చింది.

# విత్తనాలు అమ్మారు... ధాన్యం కొనుగోలు చేయరా? దేవినేని ఉమ

అమరావతి : వ్యవసాయ శాఖ తీరుపై టీడీపీ సీనియర్ నేత ,మాజీ మంత్రి దేవినేని ఉమ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తనాలు అమ్మారని, కానీ ధాన్యం కొనరా? అని సూటిగా ప్రశ్నించారు.



వ్యవసాయ శాఖ, ఆర్‌బీఏకు మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ శాఖలు విత్తనాలు అమ్మితే, ధాన్యం కొనుగోలు చేయకపోవటం విడ్డూరమన్నారు. రోడ్లమీదే ధాన్యపు రాశులున్నాయని, కానీ కొనే దిక్కు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తాకు 900 రూపాయలను అడుగుతున్నారని, మిగతా నష్టం ఎవరు భరిస్తారని ఆయన నిలదీశారు.

# సంపాదకీయం

**శనివారం 08 మే 2021**

## కరోనా కట్టడికి యాక్షన్ ప్లాన్ అవసరం

ప్రజారోగ్యం విషయంలో నేతలు చేతులెత్తేస్తున్నారు. బేరాలు ఆడుతున్నారు. అటు కేంద్రం నుంచి మొదలు రాష్ట్రాల వరకూ అదే తంతు. తమకు ఓట్లు వేసి నెగ్గించిన ప్రజలు తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకుతున్నారనేది నాయకుల విశ్వాసం. ఉప్పు,పప్పు,సబ్బు, నూనె, పెట్రోలు ? ఒకటనేమిటి అన్నిటిపైనా చెల్లిస్తున్న పన్నులే ప్రభుత్వం నడకకు నిధులు. ప్రభుత్వోద్యోగులు మొదలు ప్రజాప్రతినిధుల వరకూ అంతా ప్రజల సొమ్ముపైనే ఆదారపడి బతుకుతున్నారు. అయినప్పటికీ ప్రజలకు ఆక్సిజన్ అందక, పడకలు లేక దయనీయమైన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రజాపాలనకు, నియంతృత్వ పోకడల రాచరికానికి తేడా లేకుండా పోయింది. రోజువారీ మూడు లక్షల కరోనా కేసులు, మూడువేల మరణాలు నమోదు అవుతున్నాయి. ఇది అసాధారణమైన పరిస్థితి. ఒకవైపు దేశవ్యాప్త లాక్ డౌన్ విధించాలనే డిమాండ్లు వినవస్తున్నాయి. ఉచిత పథకాలతో డబ్బులు పంపిణీ చేసే నాయకులు ప్రజారోగ్యానికి పూచీకత్తు ఇవ్వలేకపోతున్నారు. కనీసం ఎప్పటిలోగా ప్రజలకు వాక్సినేషన్ పూర్తిచేస్తామనే అంశమూ ఇదమిత్థంగా చెప్పడం లేదు.అసలు వాక్సిన్ల కు నిధుల కేటాయింపులోనే రాష్ట్రం వాటా , కేంద్రం వాటా అంటూ రగడ మొదలైంది. 45 సంవత్సరాల పైబడినవారికే మేము వాక్సిన్లు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వ ధోరణి దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారి తీసింది. వాక్సిన్లు కొనడానికి మా దగ్గర డబ్బులు లేవని కొన్ని రాష్ట్రాలు మొండి కేశాయి. అటు కేంద్రమైనా, ఇటు రాష్ట్రాలైనా ఎవరి సొమ్ము , ఎవరికి ఖర్చు పెడుతున్నారు. మీ విలాసాలకు, వినోదాలకు, అవినీతికి ప్రజల సొమ్మే కదా వినియోగిస్తోంది? . ఈ నిజం పక్కన పెట్టి తామేదో సొంత డబ్బులు వాక్సిన్లకు ఇస్తున్నట్లు ప్రభుత్వాలు ఫోజు కొట్టడమే విచిత్రం. ప్రజల పన్నుల సొమ్మునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటున్నాయి. రాజకీయాలు పక్కన పెట్టి జాతీయ వాక్సినేషన్ కింద నిర్దిష్ట కాల వ్యవధిలో అందరికీ వాక్సిన్లు ఇవ్వాలి. ఇతర దేశాల్లోనూ పాలిటిక్స్ ఉంటాయి. కానీ ఎక్కడా ప్రజారోగ్యం విషయంలో రాజీ పడటం లేదు. కానీ మన దేశానికి వచ్చేటప్పటికి ఎక్కడలేని దౌర్భాగ్యం వెంటాడుతోంది. వాక్సిన్ వేస్తే మాకేమైనా ఓట్లు వస్తాయా? అన్న సంకుచిత దోరణిలో లెక్కలు వేసుకుంటున్నారేమో నాయకులు. ఓట్లకు డబ్బులు పంపిణీ, అనుచిత పథకాలే తమ అధికార సోపానాలుగా భావిస్తున్నారు.విషయ పరిజ్ఞానం లేని వాళ్లు ఏమైనా చేయవచ్చు. కానీ అన్ని తెలిసిన నాయకులు సమయం, సందర్భం కాని వేళలో పాలిటిక్స్ కు ప్రాధాన్యం ఇవ్వడం శోచనీయం. ఉపద్రవం చుట్టుముడుతుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటలరాజేందర్ ఉదంతాన్ని కెలికి తీశారు. ఆరోగ్యశాఖ మంత్రిగా సమీక్షలు చేస్తూ ఈటల కరోనా విషయంలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. భూకబ్జాలు, ఇతర ఆరోపణలపై విచారణలు, దర్యాప్తులు ఆగమేఘాలపై జరిపేసి శిక్షించాల్సిన ఉదంతాలు కావు. పైపెచ్చు కక్ష సాధించడానికి ఇది సమయం కాదు. సంయమనంతో చట్టం తన పని తాను చేసుకునేలా వెసులుబాటు కల్పించి ఉండాల్సింది. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన సమయం ఇది. ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి మొదలు సీనియర్ ఐఏఎస్ ల వరకూ ఈటల ఉదంతంలో తలమునకలై పోయి ఉండటం బాధ్యతారాహిత్యమే. అందుకు ముఖ్యమంత్రినే తప్పు పట్టాల్సి ఉంటుంది. రాజేందర్ విషయంతో ఆరోగ్య సమస్య పై చర్చ పక్కదారి పట్టింది. ఉద్దేశపూర్వకంగానే తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి ఇలా చేస్తున్నారనే విమర్శలూ ముఖ్యమంత్రి ఎదుర్కోవాల్సి వస్తోంది.అంతర్జాతీయంగా ఇప్పటికే అభాసు పాలయ్యాం. కేంద్ర ప్రభుత్వంతో గతంలో విభేదించిన రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామరాజన్ వంటి వారు తమ వంతు రాళ్లు విసురుతున్నారు. అమెరికా అంటు వ్యాధుల నిపుణులు ఫౌచి అయితే ప్రత్యేకించి భారత్ లో మొత్తం వ్యవస్థలన్నీ మూసేయాలంటున్నారు. సైన్యానికి అప్పగించేయాలని సూచిస్తున్నారు. నిజానికి బారత ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి స్పందిస్తే అదుపు చేయడం అసాధ్యం కాదు. అమెరికా మనదేశ జనాభాలో నాలుగో వంతు. అయినా అక్కడ కేసుల సంఖ్య మూడున్నరకోట్లు. మరణించిన వారు ఆరులక్షలు. మనదేశంలో ఇప్పటికి కేసుల సంఖ్య రెండు కోట్లు. మరణించిన వారు రెండు లక్షలు. అమెరికాలో లాక్ డౌన్ పెట్టలేదు. నెమ్మదిగా అదుపు చేసుకున్నారు. ఫౌచి వంటి వారు ఇచ్చే ఉచిత సలహాలకు క్షేత్రస్థాయి వాస్తవాలతో సంబంధం ఉండదు. భారత జీవనప్రమాణాలు, ప్రజలస్థితిగతుల గురించి ఏమాత్రం అవగాహన లేనివారి మాటలను పట్టించుకోనక్కర్లేదు. లాక్ డౌన్ వంటి విఅమలు చేసినా సడలింపు ఇచ్చిన రెండు గంటల్లోనే ప్రజలు గుమికూడి వ్యాప్తిని తీవ్రం చేయడం గతంలో చూశాం. అందువల్ల లాక్ డౌన్ చివరి అస్త్రం మాత్రమే కావాలన్న కేంద్రం వద్ద ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమైనా ఉందా? న్యాయస్థానాలకు అంతా సక్రమంగానే ఉందని అఫిడవిట్లు ఇవ్వడం, రాష్ట్రాలకు సలహాలు ఇవ్వడమేనా? ఇప్పుడు ఇమ్మీడియెట్ యాక్షన్ ప్లాన్ కావాలి

# మావోయిస్టుల టార్గెట్ వైసీపీ

విశాఖపట్టణం, మే 7, (న్యూస్ పల్స్)ఏజెన్సీలో గిరిజనం వైసీపీ అంటే జై కొడతారు. నాడు వైఎస్సార్ కాంగ్రెస్ సీఎం గా ఉన్నారు కాబట్టే వారంతా ఆయన్ని చూసి ఆ పార్టీకి ఓటేశారు. ఆయన దివంగతులు అయ్యాక వైసీపీని జగన్ ఏర్పాటు చేస్తే మరో పార్టీ వైపే చూడకుండా ఓటేస్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీకి ఒకే ఒక ఎస్టీ ఎమ్మెల్యే ఉంటే మొత్తం సీట్లు అన్నీ వైసీపీ గెలుచుకుంది. ఇక 2019 ఎన్నికల్లో మొత్తానికి మొత్తం సీట్లు వైసీపీ పరం అయ్యాయి అంటేనే మన్యం వైసీపీకి ఎంతలా ప్రాణం అయిందో అర్థమవుతోందిగా.జగన్ ఏపీలో అధికారంలోకి వచ్చాక బాక్సైట్ తవ్వకాలు జరపమని చెప్పారు కానీ ఆ దిశగా చర్యలు లేవని మావోయిస్టులు చాలా కాలంగా గుర్రుమీద ఉన్నారు. ఇక వైఎస్సార్ హయాంలో ఏజెన్సీ ముఖద్వారంలో కంపెనీని ఏర్పాటు చేసుకుని గనుల తవ్వకాలకు ఆన్ రాక్ కంపెనీ అనుమతులు తెచ్చుకుంది. దీని మీద ఎంతో పోరాటం జరిగాక అప్పటికి అది ఆగింది. తెలుగుదేశం హయాంలో కూడా చంద్రబాబు జీవో నంబర్ 97 మొదట ఇచ్చి తరువాత బాక్సైట్ తవ్వకాల మీద వెనక్కు తగ్గారు. అయినా సరే నాడు టీడీపీని మావోలు టార్గెట్ చేసి ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమలను దారుణంగా హత్య చేశారు. ఇపుడు వైసీపీ సర్కార్ మీద మావోలు వీలు దొరికినపుడల్లా కారాలు మిరియాలూ నూరుతున్నారు. దోపిడీకే విశాఖను పాలనారాజధానిగా ప్రకటించారని కూడా మావోలు విమర్శలు చేస్తూ వస్తున్నారు.ఇక చత్తీస్ ఘడ్ లో జరిగిన దారుణ మారణ హోమం తరువాత విశాఖ మన్యం కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పైగా చాలా మంది మావోయిస్టులు తలదాచుకునేందుకు విశాఖ ఏజెన్సీ చేరుకున్నారు అన్న వార్తలు కూడా అటు పోలీసులనూ ఇటు ప్రజా ప్రతినిధులనూ కలవరపాటుకు గురి చేస్తున్నాయి. విశాఖ ఏజెన్సీలో మావోలకు ఒకప్పుడు గట్టి పట్టుంది. ఇపుడు కూడా వారు బలపడేందుకు చూస్తున్నారు. చత్తీస్ ఘడ్ దురాగతం తరువాత మావోలు విశాఖ ఏజెన్సీ వైపుగా చూడడంతో పోలీసులు సైతం అప్రమత్తం అయ్యారు. ఇక వైసీపీ నేతలు అయితే మన్యం లో ఇదివరకు మాదిరిగా తిరిగేందుకు కూడా జంకుతున్నారు.వైసీపీ అధినాయకత్వం నేతలను జనాల్లోనే ఉండమంటోంది. ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టమంటోంది. ఇప్పటిదాకా ఏజెన్సీలో ఎక్కడికైనా ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, శెట్టి ఫల్గుణ వంటి వారు తిరిగేవారు. అలాగే అరకు ఎంపీ మాధవి కూడా కొండలు గుట్టకు ఎక్కి మరీ అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. అయితే ఇపుడు పోలీసుల నుంచి వస్తున్న హెచ్చరికలు సూచనలతో వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు మన్యం వైపు తొంగి చూసే పరిస్థితి లేదని అంటున్నారు. దాంతో పాటు విశాఖ ఏజెన్సీలో మావోలు మళ్ళీ తమ కార్యకలపాలను విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు అంటున్నారు. ఇదిలా ఉంటే విశాఖ ఏజెన్సీకి చెందిన 32 మంది గ్రామ వాలంటీర్లు హఠాత్తుగా తమ పదవులకు రాజీనామా చేయడం కూడా చర్చనీయాంశం అయింది. వారిని పోలీస్ ఇంఫార్మర్లుగా మావోలు అనుమానిస్తున్నారు అన్న వార్తలు కూడా వస్తున్నాయి. ఇటు పోలీసులు, అటు మావోల ధాటికి తట్టుకుని ఉద్యోగం చేయలేమని వారు చేతులెత్తేయడం కూడా అతి పెద్ద చర్చ అవుతోంది. మరి ఇలా వైసీపీ ప్రభుత్వం గిరిజనుల దగ్గరకు వెళ్లలేకపోతే రాజకీయంగా దెబ్బే అంటున్నారు. దాంతో ముందు నుయ్యి వెనక గొయ్యి అన్న చందంగా వైసీపీ నేతల పరిస్థితి తయారైంది అంటున్నారు.

# వివాదంలో గంటా సతీమణి

శ్రీకాకుళం, మే 7, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడు అన్నది అందరికీ తెలిసిందే. ఆయన ప్రకాశం జిల్లా నుంచి విశాఖకు వలస వచ్చారు. ఇక ఆయన కమ్మ సామాజికవర్గానికి చెందిన ఆమెను వివాహం చేసుకున్న సంగతి అయితే చాలా మందికి తెలియదు. కానీ ఆయన అచ్చమైన కాపు నాయకుడు అని భావిస్తారు. అయితే వేరే కులానికి చెందిన వారికి చేసుకోవడంలో తప్పు ఏమీ లేదు. అంతే కాదు ఆయనకు టీడీపీ రాజకీయాల్లో కూడా అది చాలా ఉపయోగపడిందని కూడా చెబుతారు. ఇదిలా ఉంటే అటు టీడీపీకి దూరంగా ఇటు వైసీపీలో చేరకుండా గంటా శ్రీనివాసరావు సొంత పాలిటిక్స్ చేస్తున్న సంగతి తెలిసిందే.ఇక గంటా శ్రీనివాసరావుని రాజకీయాల్లో నిత్యం విమర్శించే వారిలో ఎంపీ విజయసాయిరెడ్డి ముందుంటారు. ఇపుడు ఆయన అనూహ్యంగా గంటా సతీమణి శారదను కూడా వివాదంలోకి లాగేశారు. గంటా భీమిలీ నుంచి ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నపుడు సింహాచలం దేవస్థానంలో అవసరమే లేకపోయినా కూడా పెద్ద ఎత్తున అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇది ఏకంగా సింహాచలం దేవస్థానం ఖజానాకు కూడా పెనుభారంగా మారిందని అన్న మాట ఉంది. వారిని ఇపుడు తీసేయడానికి వైసీపీ చూస్తూంటే పెద్ద ఎత్తున గొడవలు అవుతున్నాయి. దాంతో విజయసాయిరెడ్డి దీని మీద గట్టిగానే గంటా శ్రీనివాసరావును తగులుకున్నారు. ఇదంతా చేసింది గంటా సతీమణి మేడం చౌదరి గారు అంటూ సెటైరికల్ గా కామెంట్స్ చేశారు. ఈ పోస్టుల భర్తీ వెనక ఆమె ఉన్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అదిపుడు రాజకీయ రచ్చగా మారుతోంది.గంటా శ్రీనివాసరావు తనకు ఉన్న బలమైన కాపుల దన్ను చూసుకుని ఫ్యూచర్ పాలిటిక్స్ చేద్దామని ఆలోచిస్తున్నారు. ఆయన ఏపీవ్యాప్తంగా కాపులకు తాను పెద్ద నాయకుడిని అని కూడా ఫీల్ అవుతారు. అటువంటి గంటా శ్రీనివాసరావు సగం కాపు తప్ప పూర్తి కాపు కాదు అన్నది చెప్పాలన్న ఆలోచనతోనే విజయసాయిరెడ్డి ఈ రకంగా ఆయన వైవాహిక బంధం వెనక ఉన్న కులం గుట్టు విప్పారు అన్న మాట వినిపిస్తోంది. ఇంతకాలం గంటాను విమర్శించే ఆయన ఇపుడు ఏకంగా ఆయన సతీమణిని కూడా వివాదంలోకి లాగడం వెనక రాజకీయ ఎత్తుగడలే ఉన్నాయని చెబుతున్నారు.గంటా శ్రీనివాసరావు వైసీపీలో చేరుతారని మొదట చెప్పింది విజయసాయిరెడ్డే. మరి లోపాయికారిగా ఏం జరిగిందే తెలియదు విజయసాయిరెడ్డి అంతటి వాడు మీడియా ముందు స్టేట్మెంట్ ఇచ్చాడు అంటే ఆయనకు ఆధారాలు ఉంటాయి కదా అన్న మాట ఉంది. అయితే సాయిరెడ్డి ప్రకటించిన తరువాత గంటా శ్రీనివాసరావు తాను వైసీపీలో చేరడంలేదు అని ఖండించేశారు. దాంతో వైసీపీ పరువు పోయింది. ఇక జగన్ నుంచి కూడా ఈ విషయంలో గట్టిగానే సాయిరెడ్డికి క్లాస్ తీసుకున్నట్లుగా ప్రచారం జరిగింది. ఆ మంటతోనే గంటా శ్రీనివాసరావు మీద విమర్శల జోరు పెంచేసిన విజయసాయిరెడ్డి ఇపుడు ఏకంగా ఆయన ఫ్యామిలీని కూడా లాగి కులబలం కూడా ఆయనకు దక్కకుండా మంత్రాంగం నడుపుతున్నారని అంటున్నారు.

# టీడీపీలో మళ్లీ ఎన్టీఆర్ ఫోటో వచ్చే



గుంటూరు, మే 7, (న్యూస్ పల్స్)ఏపీ ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు అన్నగారి నామస్మరణ పెరిగింది. పార్టీ వ్యవస్థాపకుడు.. దివంగత సీఎం..నందమూరి తారక రామారావు పేరు ఇప్పుడు మార్మోగుతోంది. వాస్తవానికి పార్టీ తరఫున ఏ కార్యక్రమం చేపట్టినా.. అన్నగారిని తలుచుకుంటారు. అన్నగారికి దండలు వేసి ..పక్కన పెడతారు. ఇక, అప్పటి నుంచి చంద్రబాబు నామ స్మరణలో మునిగితేలుతున్న విషయం తెలిసిందే. ఏ కార్యక్రమం జరిగినా.. ఇదే పరిస్థితి టీడీపీలో కనిపిస్తోంది. కానీ, ఇప్పుడు చంద్రబాబును పక్కన పెట్టి.. అన్నగారిని భుజాన వేసుకున్నారు తమ్ముళ్లు. పార్టీలో ఇటీవల ఇది ఎక్కువగా కనిపిస్తోంది.ఇటీవల పరిషత్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్య పూరితంగా.. వ్యవహరిస్తోందని.. ఎన్నికల్లో అంగబలం, అర్ధబలం, అధికార బలం ప్రయోగించి.. గెలుస్తోందని.. సో.. తాము తప్పుకొంటున్నామని చెప్పారు. అయితే.. దీనిపై పార్టీలోనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఎప్పటి నుంచో చంద్రబాబును పూజిస్తున్న నాయకులు అశోక్ గజపతిరాజు వంటి వారు కూడా బాబు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీంతో చంద్రబాబు మాట మార్చారు. ఇప్పుడు జరుగుతున్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి గత ఏడాది బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయని.. వాటిని రద్దు చేసి.. కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని.. ఇది ఇవ్వడం లేదు కనుక బహిష్కరిస్తున్నామని ప్రకటించారు.కానీ, చంద్రబాబు చేసిన ఈ ప్రకటన కూడా వర్కవుట్ కాలేదు. క్షేత్రస్థాయిలో నాయకులు పరిషత్ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవడం.. ఇప్పటికే అన్నీ సిద్ధం చేసుకోవడం.. పరువుతో కూడిన వ్యవహారం కావడంతో.. వారు ఎన్నికల వైపు మొగ్గు చూపారు. అయితే.. ఎవరి ఫొటో పెట్టుకోవాలి ? అనే ప్రశ్న తలెత్తింది. విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాల్లోనూ నాయకులకు ఈ సమస్య వచ్చింది. చంద్రబాబు ఫొటోతో వెళ్తే.. అధికార పక్షం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. అధినేత వద్దంటే.. నాయకులు కావాలంటున్నారు. అంటే.. టీడీపీలో తిరుగుబాటు వచ్చిందని.. ప్రచారం చేస్తున్నారు. దీంతో టీడీపీ నేతలు? ముఖ్యంగా పరిషత్ ఎన్నికల్లో తలపడుతున్న నాయకులు.. కొత్త ఎత్తుగడ వేశారు.ఇప్పుడు చంద్రబాబు ఫొటోలను పక్కన పెట్టి.. అన్న ఎన్టీఆర్ ఫొటోలతో ప్రచారం చేశారు. అన్నగారి సెంటిమెంటును రెచ్చగొట్టాలని యత్నించారు. ఎక్కడా చంద్రబాబుపేరును కూడా మచ్చుకైనా వినిపించకుండా.. అన్నగారి పాటలు.. అన్నగారి మాటలను మైకుల్లో వినిపిస్తు.. ప్రచారం చేశారు. ఇక, దీనిపై వైసీపీ నుంచి కూడా విమర్శలు వచ్చే అవకాశం లేదు. సో.. ఇప్పటికైతే.. టీడీపీ నేతలు ఈ వ్యూహాన్ని బాగానే అమలు చేస్తున్నా.. రాబోయే రోజుల్లోనూ ఇదే తరహా వ్యూహంతో చంద్రబాబును పూర్తిగా పక్కన పెడితే.. ఆయనకు మరిన్ని ఇబ్బందులు తప్పవుపార్టీ నేతలు ఇప్పుడేదో ఎన్టీఆర్ ఫొటో వాడడం కాదు? 1999లో చంద్రబాబు గెలిచిన తర్వాత క్రమక్రమంగా చంద్రబాబు ఎన్టీఆర్ ఫొటో పక్కన పెట్టేసి అన్ని పథకాలకు తన పేరు తగిలించుకుంటూ వచ్చారు. 2004లో పార్టీ ఓడిపోయాక మళ్లీ ఎన్టీఆర్‌ను వాడడం స్టార్ట్ చేశారు. తిరిగి 2014లో బాబు గెలిచాక ఒకటి రెండు పథకాలకు తప్పా అన్ని పథకాలకు చంద్రన్న పేరు తగిలించుకుంటూ పోయారు. ఇక ఇప్పుడు పార్టీ నేతలే చంద్రబాబు ఫొటో తీసేసి ఎన్టీఆర్ ఫొటోను వాడుకుంటున్నారు.

## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

విశాఖపట్నం రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి,మిగిలిన అన్ని శాఖల పనులను తాత్కాలికంగా నిలిపివేసి, వాటి నిధులను ఆరోగ్యానికి ఖర్చు చేయాలని మాజీ మంత్రి అయ్యన్న డిమాండ్ చేశారు.ముందు చూపు లేకపోవడం,నాయకత్వలోపం వల్లే దేశంలో, రాష్ట్రంలో కరోనా విజ్రుంబిస్తోందని,రాష్ట్రంలో కరోనా లెక్కలన్నీ తప్పుల తడకలే సీఎం నుంచి మంత్రులు, అధికారుల వరకు కరోనాను నిర్లక్ష్యం చేస్తున్నారని,సాక్షాత్తూ న్యాయస్థానాలకుతప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు.క్యాబినెట్ సమావేశంలో 32అంశంగా కరోనాపై ప్రభుత్వ ప్రజా ప్రతినిదులు చర్చించారంటే, దానికి సీఎం ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్ధమవుతోందని చెప్పారు..

# విశాఖపట్టణం ఫర్ సేల్

విశాఖపట్టణం, మే 7, (న్యూస్ పల్స్)విశాఖ సుందర నగరమని ప్రశాంత నగరమని అభివృద్ధికి సంకేతమని నేతలు ప్రసంగాలు చేస్తూంటారు. కానీ ఆచరణలో మాత్రం విశాఖకు పెద్దగా చేసింది ఏదీ లేదు. పోనీ చేయకపోతే పోయే. కనీసం ఉన్న వాటినైనా కాపాడితే అదే పదివేలు అంటున్నారు విశాఖ జనం. చంద్రబాబు తప్పు చేశాడని చెప్పిన జగన్ తానూ అదే తప్పులు చేస్తే ఎలా అంటోంది మేధావి వర్గం. బంగారం లాంటి ప్రభుత్వ భూములు తెగనమ్మడమేంటని కూడా ప్రశ్నిస్తోంది.వైఎస్సార్ సీఎం గా ఉన్నపుడు విశాఖలో విలువైన వందల ఎకరాల ప్రభుత్వ భూములను వుడా సహకారంతో వేలం వేసి దాంతో ఉమ్మడి ఏపీలో పలు కార్యక్రమాలు చేపట్టారు. విశాఖకు అందులో ఫలితం ఎంత దక్కిందో తెలియదు కానీ సర్కార్ భూములు మాత్రం ప్రైవేట్ పరం అయిపోయాయి. ఇక ఇపుడు జగన్ సైతం తండ్రి బాటలోనే వెళ్తున్నారు అంటున్నారు. జగన్ విశాఖలో భూములను అమ్మకానికి పెట్టడం ద్వారా ఏం సాధిస్తారు అన్న మాట కూడా సగటు జనం నుంచి వస్తోంది.విశాఖలో లూలూ గ్రూపు భూములతో పాటు దాదాపు రెండు వందల ఎకరాలను తొలి విడతగా అమ్మకానికి పెట్టారు. అయితే దీని తరువాత సింహాచలం భూములతో పాటు మాన్సాస్ భూములు, ఇంకా వివిధ ట్రస్ట్ ల కింద ఉన్న భూములను ప్రభుత్వం వేలం వేస్తుంది అంటున్నారు. ఈ జాబితాను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు బయటపెట్టారు. జగన్ విశాఖలో భూములను తెగనమ్ముతూంటే మేధావులు ఎందుకు నోరు మెదపరు అంటూ ఆయన గట్టిగానే నిలదీస్తున్నారు. పాలన చేతగాక ఖజనాను ఖాళీ చేశాడని, ఇపుడు భూములు అమ్మి ఖజానాను నింపుకోవాలని చూడడం దారుణమని కూడా అయ్యన్న అంటున్నారు.నిన్న జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీని పెద్ద మెజారిటీ ఏమీ రాలేదు. అధికారంలో ఉండడంతో పాటు అనేక రకాలుగా అండదండలు కలసి వచ్చి మేయర్ పీఠం బొటాబొటీ మెజారిటీతో దక్కింది. ఇపుడు స్టీల్ ప్లాంట్ ని కేంద్రం ప్రైవేట్ పరం చేస్తోంది. దానిని ఆపే ప్రయత్నం ఏదీ జగన్ చేయడంలేదు. అదే సమయంలో జగన్ కూడా తానూ రెడీ అంటూ భూములను అమ్మకానికి పెట్టడం వల్ల విశాఖ వాసుల్లో వైసీపీ సర్కార్ మీద వ్యతిరేకత పెరుగుతోంది. విశాఖను పాలనా రాజధాని జగన్ ప్రకటించారు. మరి విశాఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం వద్ద ఉన్న కార్యాచరణ ఏంటని కూడా చర్చకు వస్తోంది. అన్నీ అమ్మేశాక, సర్వం ప్రైవేట్ పరం అయ్యాక జగన్ ముఖ్యమంత్రిగా విశాఖ వచ్చి కూర్చున్నా ఉపయోగం ఏంటని కూడా అంటున్నారు.

# తమ్ముళ్ల వితండవాదం

విజయవాడ, మే 7, (న్యూస్ పల్స్)సీపీకి, టీడీపీకి మధ్య ఉన్న వివాదాలు, విభేదాలు అందరికీ తెలిసిందే. ఏ పక్షం నాయకులు నోరు విప్పినా.. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు కావొచ్చు లేదా.. ఇతర విషయాలు కావొచ్చు.. ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం కామన్. అయితే.. ఇప్పుడు ఈ క్రమంలోనే టీడీపీలో ఒక వితండ వాదం తెరమీదికి వచ్చింది. అదేంటంటే.. ఏపీలో జగన్ ప్రభుత్వానికి వ్యూహం లేదని.. తాము చేస్తున్న డిమాండ్లనే.. కొద్ది రోజుల తేడాతో అమలు చేస్తున్నారని.. అంటున్నారు.టీడీపీ నేతలు రెండు ఉదాహరణలు చెబుతున్నారు. రాష్ట్రంలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జగన్ ప్రభుత్వం ప్రజలను గాలికి వదిలేసి.. తన పబ్బం గడుపుకొందని.. ఈ క్రమంలో రాష్ట్రంలో కరోనా తీవ్రత పెరిగిపోయిందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తమ పార్టీ అధినేత , మాజీ సీఎం చంద్రబాబు కీలక సలహా ఇచ్చారని.. రాష్ట్ర వ్యాప్తంగా కర్ఫ్యూను పటిష్టంగా అమలు చేయాలని సూచించారని అంటున్నారు. అయితే.. రాష్ట్ర సర్కారు మాత్రం ఈ విషయంలో మొండిగానే వ్యవహరించినా.. తర్వాత తర్వాత టీడీపీ అధినేత చెప్పినట్టే చేశారని అంటున్నారు.ఇక, నారా లోకేష్ విషయంలోనూ ఇలానే జరిగిందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇంటర్ పరీక్షల విషయంలో ప్రభుత్వం జోరుగా నిర్ణయం తీసుకుందని.. ఎట్టి పరిస్థితిలోనూ ఆపేది లేదని స్పష్టం చేసిందని.. అయితే.. లోకేష్ మాత్రం పరీక్షల కారణంగా.. రాష్ట్రంలో కరోనా తీవ్రత మరింత పెరుగుతుందన్న విషయాన్ని స్పష్టం చేశారని.. ఈ క్రమంలోనే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేసి.. ప్రభుత్వానికి నివేదించారని.. అయినా కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు.అయితే.. ఇప్పుడు మాత్రం తాజాగా పరీక్షలు వాయిదా వేస్తూ.. తీసుకున్న నిర్ణయం కేవలం.. లోకేష్ డిమాండేనని చెబుతున్నారు. మొత్తంగా ఈ రెండే కాకుండా.. ప్రభుత్వ వైద్యశాలలో పడకల పెంపు కూడా ఈ కోవలేదని అంటున్నారు. అంటే.. టీడీపీ బాటలోనే వైసీపీ నడుస్తోందనే వాదనకు బలం చూకూరుతోందని అంటున్నారు.

## మడ అడవులపై పూర్తి నివేదిక రెడీ

కాకినాడ, మే 7, (న్యూస్ పల్స్)పేదలందరికీ ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాకినాడలోని మడ అడవులను ధ్వంసం చేయడంపై వివాదం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సహా పలు సంస్థల్లో ఈ వివాదం ఉంది. దానికి తోడు తాజాగా ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగాల వరకూ ఈ వ్యవహారం వెళ్లింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి)లో భాగంగా సామాజిక, పర్యావరణ ప్రభావాలపై పరిశీలించే విభాగం (ఎస్‌ఇసియు) దీనిపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా దర్యాప్తు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా యుఎన్‌డిపి నిధులతో చేపట్టిన పథకానికి తూట్లు పొడుస్తూ మడ అడవులను ధ్వంసం చేయడం, ఈ ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టడంపై వివాదం కొనసాగుతోంది. మడ అడవుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణాలకు పూనుకుంటోందని ఫిర్యాదులు వెళ్లడంతో ఈ సంస్థ రంగంలో దిగింది. ప్రజాస్వామ్య సంప్రదాయ మత్స్యకార్మికుల వేదికతో పాటుగా ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ అనే సంఘాలు యుఎన్‌డిపికి ఫిర్యాదు చేశాయి. గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జిసిఎఫ్) పేరుతో రూ.298 కోట్లతో చేపట్టిన పర్యావరణ అభివఅద్ధి కార్యక్రమాలకు ఎపి ప్రభుత్వ చర్య విఘాతం కలిగిస్తోందని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో, జిసిఎఫ్ ప్రాజెక్టు పరిరక్షణ కోసమంటూ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు. గతేడాది మార్చి నెలలో లాక్‌డౌన్‌కు ముందు చేపట్టిన పనులు, లాక్‌డౌన్ సమయంలోనూ కొనసాగాయి. అప్పట్లో ఎపి ప్రభుత్వం అందరికీ ఇళ్ల స్థలాల కోసమంటూ భూములను సేకరించింది. దీనిలో భాగంగా మడ అడవుల ప్రాంతంలో సుమారు వంద ఎకరాలను పూడ్చి పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించేందుకు ప్రయత్నించిందనే ఫిర్యాదు సారాంశం. ఆ క్రమంలో మడ అడవులను ధ్వంసం చేశారని, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించారని ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఇది పెద్ద వివాదమైంది. దానిపై ఎపి హైకోర్టులో కూడా కేసులు దాఖలయ్యాయి. తాజాగా ఈ వ్యవహారంలో యుఎన్‌డిపి విచారణ చేపట్టడం చర్చనీయాంశమైంది.

## ఏపీలో కరోనా రోగుల పరిస్థితి దారుణం

ఏలూరు, తిరుపతి, మే 7, (న్యూస్ పల్స్)కరోనా సెకండ్ వేవ్ తో ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమవుతోంది. చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పరిస్థితి అంతకంతకూ దిగజారుతోంది. ఆస్పత్రులన్ని కరోనా రోగులతో నిండిపోయాయి. కొత్తగా వచ్చిన రోగులకు పడకలు లేవు. తగినంత మంది వైద్య సిబ్బంది లేరు. దీంతో అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్న రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.ఆస్పత్రుల్లో చోటు, సౌకర్యాలు లేకపోవడంతో వరండాలు, అంబులెన్స్ లోనే ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకుని రోగులు ప్రాణాలు నిలుపుకుంటున్నారు. ఆక్సిజన్ సిలిండర్లను ఆస్పత్రుల గోడలకు, గ్రిల్స్, అంబులెన్స్ లకు బిగించుకుని ఊపరి తీసుకుంటున్నారు. కుర్చీలు, వరండాలోని ఖాళీ ప్రదేశాలు ఆస్పత్రుల బయట బారులు తీరిన అంబులెన్స్ లు ఇలా క్కడబడితే అక్కడ రోగులు అవస్థలు పడుతున్న దృశ్యాలు కుటుంబ సభ్యులు, బంధువుల్లోనే కాదు చూస్తున్న వారందరికీ కంటతడి పెట్టిస్తున్నాయి.రాష్ట్రంలో అత్యధిక కేసులు చిత్తూరు జిల్లాలోనే నమోదవుతున్నాయి. కరోనా మరణాల సంఖ్యం వెయ్యికి చేరువలో ఉంది. ఎక్కడికక్కడ ఆస్పత్రులన్నీ బాధితులతో నిండిపోతున్నాయి. పెరుగుతున్న బాధితుల సంఖ్యకు తగ్గట్లుగా పడకల సంఖ్య పెంచే వీలులేకపోవడంతో బాధితులు ఆస్పత్రి బయటే నరకయాతన అనుభవిస్తున్నారు.చిత్తూరు జిల్లాలో నమోదవుతున్న కేసుల్లో మూడో వంతు తిరుపతిలోనివి కావడం గమనార్హం. పద్మావతి కోవిడ్ ఆస్పత్రి, రుయా కోవిడ్ ఆస్పత్రులన్నీ కరోనా రోగులతో నిండిపోయాయి. ఈఎస్ఐ, ఆయుర్వేద ఆస్పత్రులన్నింటినీ కోవిడ్ ఆస్పత్రులుగా మార్చివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్ని కలిపి 33 చోట్ల చికిత్స అందిస్తున్నారు.వాటితోపాటు కొన్ని క్వారంటైన్ కేంద్రాలు కూడా ఉన్నాయి. మొత్తంగా కలిపి జిల్లాలో 5 నుంచి 6 వేల పడకలు ఉన్నాయి. ఇవన్నీ కూడా నిండిపోవడంతో కొత్తగా వచ్చే రోగులకు చికిత్స అందించే వీలు లేక వైద్య సిబ్బంది ఒత్తిడి పెరుగుతుంది.రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పడకలున్నప్పటికీ డబ్బులు ఇచ్చే వారిని మాత్రమే చేర్చుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రోజుకు దాదాపు 2 వేల కేసులు నమోదవుతు న్నాయి. పాజిటివ్ కేసులు ఇలాగే పెరిగితే దయనీయ పరిస్థితులు ఏర్పడుతాయన్న భయాందోళన జిల్లా ప్రజల్లో నెలకొంది.అటు ఏలూరులోనే కరోనా రోగులు పడరాని పాటు పడుతున్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పడకలన్నీ నిండిపోయాయి. దీంతో వరండాలోని బెంచులు, అంబులెన్స్ లో రోగులకు వైద్యం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో కుటుంబ సభ్యు?లు, బంధువులే ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చుకొని అంబులెన్స్ లో చికిత్స చేస్తున్నారు. ఆస్పత్రులో చేరేందుకు గంటలు, రోజుల తరబడి నిరీక్షించాలన్సి పరిస్థితి ఏర్పడింది.

## మా రేషన్ కు రావలసిన సరుకులు మాకు ఇప్పించండి

కౌతాళం ముఖ్యమంత్రి ప్రతిఒక్కరుకి నాణ్యమైన రేషన్ బియ్యం అందించాలని రేషన్ లో పప్పు, చక్కెర సబ్సిడీ కిఇవ్వాలని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటే గ్రామాల్లో మాత్రం రేషన్ బియ్యం ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు ఇదేమిటని అడిగితే రేషన్ బియ్యం మాత్రమే వచ్చాయి చక్కెర, పప్పు లేవు అని కరకండిగా చెప్పేస్తున్నారు. మరి కొన్ని రేషన్ షాపులో చక్కెర, బ్యాళ్ళు ఇస్తూన్నారు కదా చెబితే లేవు అయిపోయాయి అని ఘాటుగా సమాదానం చెబుతున్నారు. శుక్రవారం మండల పరిధిలో ఏరిగేరి గ్రామ పంచాయతీ లో ఉన్న లక్ష్మీ నగర్ (లాక్షమ్మ అవ్వ గుడి) చోటుచేసుకుంది. లక్ష్మమ్మ అవ్వ గుడి ప్రజలకు రేషన్ షాపులో వాళ్లకు రావలసిన సరుకులు రావడం లేదని గ్రామంలో ఏ ఒక్కరు కూడా రేషన్ తీసుకోకుండా మాకు రావసిన పప్పు, చక్కెర, బియ్యం, ఇలా రేషన్ షాపులో వేస్తుంటే ఇక్కడ మాత్రం బియ్యం వేస్తున్నారని డీలర్లు కు గ్రామ ప్రజలకు వాగ్వివాదం జరిగింది అధికారులు స్పందించి వెంటనే లక్ష్మీ నగర్ వాసుల కు న్యాయం జరగాలని కోరారు. అందరికీ అందినట్టే మాకు కూడా అన్ని సరుకులు ఇచ్చేట్టుగా చూడాలని ఆవేదన వ్యక్తంచేశారు. అసలే కరోన టైం అని బయటికి పోనీ పరిస్థితి అని మిరే మాకు న్యాయం చేయాలని కోరారు. రేషన్ సరుకులు అన్ని అందితే బియ్యం ను తీసుకుంటామని లేకపోతే మీ బియ్యం వద్దు అని తేల్చి చెప్పారు.

# భారీ చోరీ రికవరీ

చిత్తూరు భారీ చోరీ కేసును చిత్తూరు పోలీసులు ఎట్టకేలకు చేధించారు. అంతర్రాష్ట్ర నేరస్తులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి మూడు కోట్ల రూపాయల విలువ చేసే వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలను , 90 లక్షల రూపాయల విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దొంగలు అతి చాకచక్యంగా ఎలాంటి ఆధారాలు లేకుండా దోచుకెళ్లిన ప్పటికీ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వారిని అరెస్టు చేసి వారినుంచి భారీ ఎత్తున చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాలు విదేశీ కరెన్సీ రికవరీ చేయ గలిగారు ,ఈ నెల 29వ తేదీన చిత్తూరు మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత డీకే ఆదికేశవులు నాయుడు కు స్వయానా సోదరుడు బద్రి నారాయణ ఇంట్లో పెద్ద ఎత్తున చోరీ జరిగిన విషయం తెలిసిందే , చిత్తూరు నగరం బి వి రెడ్డి కాలనీ లోని పై అంతస్తులో బద్రి నారాయణ అతని కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా కింది అంతస్తులో దొంగలు చాకచక్యంగా దోచుకెళ్లారు , ఈ కేసును చిత్తూరు జిల్లా ఎస్పీ సెంథిల్ కుమార్ , చిత్తూరు సబ్ డివిజినల్ పోలీస్ అధికారి సుధాకర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు , విశాఖపట్నం జిల్లా కొత్త గాజువాక కు చెందిన కర్రీ సతీష్ అలియాస్ సత్తిబాబు, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చెన్నం పేట మండలంకు చెందిన నరేంద్ర లను అరెస్ట్ చేశారు వీరిద్దరూ కూడా అంతర్రాష్ట్ర నేరస్తులు ఈ కేసులో చోరీ సొత్తు కొనుగోలు చేసిన కడప జిల్లా రాయచోటికి చెందిన అనిల్ కుమార్ ఆచారి ని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు, నిందితుల వద్ద ద్విచక్ర వాహనం బుల్లెట్ రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ సెంథిల్కుమార్ శుక్రవారం చిత్తూరులో మీడియాకు తెలిపారు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నేరస్థులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు ఈ మీడియా సమావేశంలో చిత్తూరు డిఎస్పి సుధాకర్ రెడ్డి క సిఐ లు రమేష్. , యుగంధర్ , నరసింహ రాజు పాల్గొన్నారు

## విశాఖలో డ్రోన్ల ద్వారా పోలీసింగ్

విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ మళ్లీ కర్ఫ్యూతో బందీ అయింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో నగరంలో 12 గంటల నుంచి కర్ఫ్యూ అమలులోకి వచ్చింది. పోలీసుల సూచనలతో విశాఖ నగరంలోని ప్రధాన వర్తక సముదాయాలు, షాపింగ్ మాల్స్ కర్ఫ్యూ ప్రారంభానికి ముందుగానే మూతపడ్డాయి.12 గంటలకే నగరంలోని చాలా చోట్ల జనసంచారం తగ్గి, రోడ్లు నిర్మానుష్యంగా మారి పోయాయి. నగరంలోని పలుచోట్ల డ్రోన్ కెమెరా ద్వారా జనసంచారంపై నిఘా పెట్టారు పోలీసులు.రోజురోజుకు పెరుగుతున్న కరోనా కేసులు తో విశాఖ జిల్లాలో స్వచ్ఛంద పాక్షిక లాక్ డౌన్ లను ఎక్కడికక్కడ స్థానిక వర్తకులు కొనసాగిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం కర్ఫ్యూ ని అమలులోకి తెచ్చింది.ఈ కర్ఫ్యూ ప్రభావం ఏపీ ఆర్థిక రాజధాని విశాఖ లో మొదటిరోజు నుంచే స్పష్టంగానే కనిపించింది. నగరంలోని జగదాంబ సెంటర్, సిరిపురం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, గాజువాక ,మధురవాడ వంటి ప్రాంతాల్లో కర్ఫ్యూ ప్రారంభానికి గంట ముందు నుంచే ప్రధాన వర్తక సముదాయాలు ,షాపింగ్ మాల్స్ ను నిర్వాహకులు మూసివేశారు. పోలీసులు ప్రత్యేకంగా డ్రోన్ ద్వారా పరిస్థితి సమీక్షిస్తున్నారు.నగరంలోని చాలా ప్రాంతాల్లో జన సంచారం తగ్గి, రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. కర్ఫ్యూ ప్రారంభానికి కొన్ని గంటల ముందే పోలీసులు రోడ్లపైకి వచ్చి కర్ఫ్యూ అమలులోకి వస్తుందని ప్రజలు తమ కార్యకలాపాలు ముగించుకొని త్వరగా ఇళ్లకు చేరాలంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. కరోనా కారణంగా ప్రజలు ప్రభుత్వం విదించిన కర్ఫ్యూకి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# హైదరాబాద్ కేరాఫ్ కరోనా



హైదరాబాద్, మే 7, (న్యూస్ పల్స్)కరోనా సెకండ్ వేవ్ ప్రభావం మన భాగ్యనగరంపై తీవ్రంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల బెడ్స్ ఫుల్ అయ్యి రోగులు బెంబేలెత్తుతున్నారు. మార్చి నెలలో 2 వేల 152 కేసులు నమోదు కాగా ఏప్రిల్ లో ఆ సంఖ్య 23వేల 672 కు చేరిందంటే ఒక్క నెలలోనే 21 వేలకు పైగా కొత్త కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అధికారిక లెక్కల ప్రకారమే కేసుల సంఖ్య ఇలా ఉంటే అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య రెట్టింపు ఉందంటున్నారు. బెడ్స్ కొరత ఓ వైపు, ఆక్సిజన్ కొరత మరోవైపు సిటీ జనాలను కంగారు పెట్టిస్తుంది కరోనా వైరస్ సృష్టించిన కల్లోలం ఏప్రిల్ నెలలో అధికంగా ఉంది. వేల సంఖ్యలో వైరస్ కేసులు నమోదయ్యాయి. గడిచిన నెలలో గ్రేటర్ హైదరాబాద్లో 23 వేల 672 మందికి వైరస్ సోకింది. జీహెచ్ఎంసీ పరిధిలో సగటున రోజుకు 784 మందికి వైరస్ సోకుతున్నట్లు నిర్ధారణ అవుతోంది. మొదటి మూడు వారాల కంటే చివరి వారంలోనే వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంది. ఏప్రిల్ నెలలో 21 రోజులకు 10,502 మందికి కరోనా నిర్ధారణ కాగా, ఆ తర్వాత 9 రోజుల్లో 12,672 మందికి వైరస్ సోకింది. కరోనా మొదటి దశ కంటే రెండో దశ వ్యాప్తి ఎక్కువగా ఉంది. గతేడాది మార్చిలో

### నెలలో 20వేలకు పైగా కేసులు

74 మందికి కరోనా సోకగా, ఈ ఏడాది అదే నెలలో 2,152 మందికి వైరస్ సోకింది. గత ఏప్రిల్ నెలలో 527 మందికి కరోనా నిర్ధారణ కాగా, ఈ ఏడాది ఏప్రిల్లో 23,174 మందికి వైరస్ సోకింది. ఈ ఏడాది మార్చి నెల కంటే 21,022 కేసులు అధికంగా నమోదయ్యాయి. అయితే మొదటి వేవ్ లో చాలా వరకు పెద్దగా లక్షణాలు లేకపోవడం ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు పెద్దగా రాలేదు. కానీ, ప్రస్తుతం కేసులు జెట్ స్పీడ్ తో పెరగడమే కాకుండా వైరస్ సోకిన వారిలో తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటున్నాయి. చాలా మంది రోగులకు ఆక్సిజన్ స్థాయిలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి దీంతో ఆసుపత్రి లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. గాంధీ ఆస్పత్రికి రోజూ వంద నుంచి రెండు వందల అడ్మిషన్లు వస్తుండగా టిమ్స్లో 30 నుంచి 50 వరకు, కింగ్కోఠి ఏరియా ఆస్పత్రిలో 30 వరకు, చెస్ట్ ఆస్పత్రిలో 20 వరకు అడ్మిషన్లు ఉంటున్నాయి. ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రాలలో చేరే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. ఒక్కో ఆస్పత్రిలో వెయిటింగ్ లిస్ట్ 50 నుంచి 80 మంది వరకూ ఉంది. ఇక ఇదిలా ఉంటే ప్రైవేట్ ఆసుపత్రులు బెడ్స్ ఫుల్ పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. లక్ష రూపాయలు అడ్వాన్స్ లేనిదే బెడ్స్ ఇవ్వట్లేదు. కొవిడ్ చికిత్స పేరుతో ఇష్టమొచ్చినంత దండుకుంటున్నాయి. ఇక అటు అంబులెన్స్ ల నిర్వాహకులు రేట్లను అమాంతం పెంచేశారు. ఇక కోవిడ్ రోగులకు అత్యవసర సమయంలో చికిత్స కోసం వినియోగిస్తున్న రెమిడెసివర్ లాంటి ఇంజెక్షన్స్ ను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మొత్తం మీద హైదరాబాద్ లో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. హాట్ స్పాట్స్ లో కరోనా కట్టడి చర్యలు పూర్తి స్థాయిలో తీసుకోవడం లేదు ఆలస్యంగా కళ్లు తెరిచిన జీహెచ్ఎంసీ కరోనా కట్టడిలో భావంగా ఇంటింటి సర్వే చేసి కరోనా లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన మందులు అందజేస్తున్నారు. మొదటి రోజు 40 వేల ఇళ్లలో ఈ సర్వే కొనసాగింది. అయితే ఆలస్యంగానైనా కళ్ళు తెరిచిన జీహెచ్ఎంసీ ఇప్పటికైనా కరోనా కట్టడికి చిత్త శుద్ధితో కృషి చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

## మాస్కుల పంపిణీ

పూతలపట్టు కరోనా మహమ్మారి నుండి నియోజకవర్గ ప్రజలను రక్షించుకునేందుకు పూతలపట్టు శాసనసభ్యుడు డాక్టర్ ఎంఎస్ బాబు సొంత నిధులతో 50,000 మాస్క్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శు క్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎంఎస్ బాబు తనయుడు ప్రవీణ్ చేతులమీదుగా మండలాలకు మాస్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ఉధృతి కారణంగా అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కరోనా నుంచి అందరనీ ఆదుకునేందుకు తన తండ్రి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మస్కులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరికి మాస్క్ లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంకు మాస్క్ లను పంపనున్నామని అక్కడి నుండి గ్రామాలకు పంపిణీ చేస్తామన్నారు. అందరూ మాస్కులను ధరించి, కరోనా నుండి రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాస్క్ పంపిణీకి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అందరు కరోనా నుండి రక్షణ పొందడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి మహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

## ఆక్సిజన్ ను వృథా చేయకండి

గుంటూరు గుంటూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కరోనా పరిస్థితులపై కలెక్టర్ వివేక్ యాదవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక కొవిడ్ సెంటర్ ను అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య సేవలను విస్తృతం చెయ్యాలని అయన సూచించారు. కరోనా రోగుల ప్రైమరీ కాంటాక్ట్ గా గుర్తించిన వారందరికీ పరీక్షలు జరపాలని, ప్రస్తుతం ఆక్సిజన్ కు ఏర్పడిన ప్రాధాన్యత దృష్ట్యా ప్రాణవాయువు వృథా కానివ్వరాదని, దీనిపై వైద్యాధికారులు దృష్టి సారించాలని కోరారు.

## కోవిడ్ వైద్యంపై కలెక్టర్ సమీక్ష

నెల్లూరు నెల్లూరులో జిల్లా అధికారులతో కలెక్టర్ చక్రధర్ బాబు శు క్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కరోనా రోగులకు ఇస్తున్న చికిత్సలు, అందిస్తున్న మందులు, తీసుకుంటున్న జాగ్రత్తలపై కలెక్టర్ సమీక్ష జరిపారు. జిల్లాలో వైద్య సేవలను అందించడంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కోవిడ్ కేర్ కేంద్రాలను కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరారు.

## ఇస్రో ఉద్యోగులకు డ్రోన్ సేవలు

నెల్లూరుమే 7, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా లోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం లో పనిచేస్తున్న ఉద్యోగుల కాలనీలలో కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణం లో ఇస్రో హోమ్ కొరెంటైన్ లో ఉన్న వారికీ డ్రోన్ ల సహాయం తో సేవలు అందించడానికి ట్రయిల్ రన్ చేసారు . షార్ లోని కాలనీల్లో, సూళ్లూరుపేట లోని ఇస్రో కాలనీల్లో కరోనా విజృంభిస్తున్న తరుణం లో వారికీ ప్రత్యేక సేవలు అందించడానికి ఇస్రో వినూత్న ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే కరోనా బారిన పడి 25 మందికి పైగా మరణించి ఉ ఒడటం ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కరోనా వైరస్ బారినపడి హోమ్ క్వారంటైన్ లో ఉండటం తో ఇస్రో డ్రోన్ ల సహాయం తో సేవలు అందించడానికి ప్రయోగాత్మక ప్రయత్నాలు చేసింది ఇస్రో కాలనీలలో డ్రోన్ల సహాయం తో మందులను పిచికారీ చేయడం తో పాటు కరోనా బారిన పడి హోమ్ క్వారంటైన్ లో ఉండే వారి ఇంటికి డ్రోన్ ల సహాయం తో వారికీ అవసరమైన మందులను ,కూరగాయలను అందించాలని నిర్ణయించారు. దీనికోసం గరుడా ఏరోస్పేస్ కంపెనీ సహకారాన్ని అందిస్తుంది

## గ్రీన్ ఛానల్ లో ఆక్సిజన్ ట్యాంకర్..తప్పిన పెను ప్రమాదం

విజయవాడ మే 7, (న్యూస్ పల్స్)విజయవాడ జీజీహెచ్ లో ఆక్సిజన్ తో చికిత్సపొందుతున్న సుమారు నాలుగు వందలకు మంది కోవిడ్ భాదితులను పెను ప్రమాదం తప్పింది. పోలీసులు వారికి ఆక్సిజన్ అందించి వారి ప్రాణాలను కాపాడారు. వివరాలు ఇలా వున్నాయి. విజయవాడ జీజీహెచ్ కు 18టన్నుల తో వస్తున్న ఆక్సిజన్ ట్యాంకర్ గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాకింగ్ వ్యవస్థ తో సంబంధాలు తెగిపోయాయి. దాంతో కంగారు పడిన సంబంధిత అధికారులు విజయవాడ సిటీ కమిషనర్ కి సమాచారాన్ని చేరవేసారు. అత్యవసర పరిస్థితి వుండడంతో అయన హుటాహుటిన రంగంలోకి దిగి ఒరిస్సా నుండి విజయవాడ వరకు ఉన్న అన్ని మార్గ మధ్యలో ఉన్న జిల్లా ఎస్పీలను అప్రమత్తం చేసారు. దాంతో ఆయా జిల్లాల పోలీసులు హుటాహుటిన జాతీయ రహదారిపై వచ్చి సదరు ట్యాంకర్ కోసం గాలింపులు జరిపారు. చివరకు తూర్పు గోదావరి జిల్లా, ధర్మవరం వద్ద ప్రత్తిపాడు పోలీసులు ఓ డాబా లో ఆక్సిజన్ ట్యాంకర్ ని గుర్తించారు. డ్రైవర్ ను ప్రశ్నించారు. నిరంతరాయంగా ఆక్సిజన్ సరఫరా లో నిమగ్నం అవడంతో అలసిపోయి వాహనాన్ని నిలిపి వేసినట్టుగా పత్తిపాడు సిఐ కి డ్రైవర్ వివరించాడు. డ్రైవర్ సమస్యను ప్రత్తిపాడు సిఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఉన్నతాధికారులు ఆక్సిజన్ ట్యాంకర్ కు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసారు. డ్రైవర్ కి తోడుగా అనుభవం కలిగిన హోంగార్డుతో ఆక్సిజన్ ట్యాంకర్ ను గ్రాన్ ఛానల్ ద్వారా సురక్షితంగా విజయవాడ జి.జి.హెచ్ కి చేర్చారు. ట్యాంకర్ జీజీహెచ్ కు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటనకు యేడాది

విశాఖపట్నంమే 7, (న్యూస్ పల్స్) విషాద ఘటనకు ఏడాది పూర్తయింది. 12 మంది జీవితాలను పొట్టన పెట్టు కున్న విశాఖ ఎల్జీ పాలిమర్స్ దుర్ఘట న చేదు జ్ఞాపకాలు నేటికి వెంటాడు తూనే ఉన్నాయి.ఏడా ది క్రితం వారి జీవితాల్లో నింపిన చీకట్లు నేటికి వారి కళ్ళు ముందు కదలాడు తూనే ఉ న్నాయి. విశాఖ ప్రజల జీవితాల్లో ఎల్ జి పాలిమర్స్ ఘటన పీడకలగా మిగిలి పోయింది.విష వాయువు 12 మందిని పొట్టన పెట్టుకుంది.వేలాది మందిని అచేతనంగా మార్చేసింది.ఈ ఘటన పై స్పందించిన సీఎం జగన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్వయం గా పరామర్శించారు.మృతులకు పరిహారాన్ని కూడా అందించారు.నాటి భయా నక పరిస్థితులు ఇప్పటికీ వెంకటా పురం, వెంకటాద్రిగార్డెన్, పద్మనా భనగర్, జనతాకాలనీ వాసుల కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నా యి.నగరంలోని ఇతర ప్రాంతాలకు స్టైరీన్ విషవాయువు వ్యాపించి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. నగరవాసులకు మూడు రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసింది.స్టైరీన్ ట్యాంకు పేలిపోతుందనే వదంతులతో అడవివరం, వేపగుంట, పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ తది తర ప్రాంతాల వాసులు ఇళ్లు వదలి రోడ్లపైకి వచ్చేశారు

## ఆక్సిజన్ తయారీ కేంద్రాల వద్ద అఖిలపక్షం నిరసనలు

హిందూపురం హిందూపురం కరోనా రోగులు కు ఆక్సిజన్ సరఫరా విషయంలో అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయం తో పనిచేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేసారు. ఆక్సిజన్ తయారీ కేంద్రాలు వారు హిందూపూరానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి సరఫరాలో ఎక్కడ అవాంతరాలు లేకుండా కొరత లేకుండా సకాలంలో కరోనా రోగులకు ఆక్సిజన్ అందేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. తమ ప్రాంతంలో తయారీ కేంద్రాల్లో సంమృద్ధిగా ఆక్సిజన్ లభిస్తుంటే ఇతరత్రా కారణాలు తో ఆక్సిజన్ కొరత సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదని అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. గత 3 రోజుల క్రితం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు పునరావృతం కాకూడదని వారన్నారు. ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక తుమకుంట పారిశ్రామిక వాడలో ఆక్సిజన్ తయారీ కేంద్రాలను సందర్శించారు. ఆక్సిజన్ ఉత్పత్తి, సరఫరా వివరాల ను అడిగి తెలుసుకున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఆమడ దూరంలో తయారీ కేంద్రాలు వున్నా కూడా ఆక్సిజన్ అందక కరోనా రోగులు చనిపోయారని, ఇది ఎంతో విచారమని వారన్నారు. ఇలా ఎప్పటికీ జరగకుండా తయారీ కేంద్రాల వారు హిందూపురం కు తర్వాత అనంతపురము జిల్లా కు సరిపడే ఆక్సిజన్ ను అందించేలా చర్యలు మానవతా దృక్పథం తో చేపట్టాలన్నారు. కరోనా ను అదనుగా చేసుకొని కర్ణాటక రాష్ట్రాలకు బ్లాక్ మార్కెట్ కి పాల్పడితే ప్రతిఘటిస్తామన్నారు తయారీ కేంద్రాల వారు ఉ త్పత్తుల కు అవరోధాలు ఇతరత్రా ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ అధికారులు సహకారం అందిస్తారని ఆక్సిజన్ సరఫరాలో తయారీ కేంద్రాల వారు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఆనంతరం వారు తయారీ కేంద్రం వద్ద ప్లే కార్డులు తో నిరసనలు చేశారు. ఆక్సిజన్ సరఫరాలో నిర్లక్ష్యం వద్దు, హిందూపురం కరోనా రోగులు కి సరిపడా ఆక్సిజన్ ను సరఫరా చేయాలి ,అని నినాదాలు చేశారు తయారీ కేంద్రాల వారు హిందూపురం ప్రాంతంలో ఆక్సిజన్ కొరత రాకుండా అప్రపత్తమై ఉత్పత్తులు పెంచి సకాలంలో ఆక్సిజన్ ను అందించాలని విన్నవించారు.

## పక్కదారి పడుతున్న వ్యాక్సిన్లు, సామాన్యునికి అందుబాటులో లేని వ్యాక్సిన్

-స్థానికేతరులకు, రికమండేషన్ వారికే వ్యాక్సిన్లు

-ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

రాజమండ్రి నలబై ఐదు సంవత్సరాలు పైబడిన వారందరూ కోవిడ్ వ్యాక్సిన్లు వేయించుకోవాలని ప్రభుత్వం ప్రతిపాధనలు ఇచ్చినప్పటికి వ్యాక్సినేషన్ లేక, అందుబాటులోకి రాకపోవడం కారణంగా కొందరు వ్యాక్సిన్లు వేయించుకోలేకపోతున్నారు.అరకొర వ్యాక్సిన్లు ఉన్నప్పటికి అవి కూడా రికమండేషన్ ఉన్నవారికే వేస్తున్నారంటూ రాజానగరం మండలం పాలచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పి.హెచ్.సి నందు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.దానికి తోడు పీ.హెచ.సిలో పనిచేసే ఉద్యోగులు కొందరు అడిగిన వాటికి సమాదానం చెప్పకపోవడంతోపాటు, నోటి దురుసుగా మాట్లాడుతున్నారని వాపోయారు.ఏ.సి కార్లలో వచ్చే వారికి మాత్రమే వ్యాక్సిన్లు రేకమండేషన్ ప్రకారం వేయడం జరుగుతుందని, గత వారం రోజులుగా తిరుగుతున్నప్పటికి వ్యాక్సిన్లు వేయడం లేదన్నారు. కనీసం పి.హెచ్.సి లో సరైన వసతులు కూడా లేవన్నారు.ఎండలో నిలబడి ఉండాల్సి వస్తుందని,వయో వృద్ధులు పలువురు వేడిమికి తట్టుకోలేక స్పృహ కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్పిటల్లో వ్యాక్సిన్ వేయించుకోవడానికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు వ్యాక్సిన్లు తమకు అందేలా చూడాలని అక్కడ గ్రామస్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నృసింహుడికి సంప్రదాయబద్ధంగా చందనం అరగదీత

సింహాచలం విశాఖ సింహాచలం వరాహ లక్ష్మీనృ సింహస్వామికి సమర్పించే తొలివిడత చందనం అరగదీత సంప్రదాయబ ద్ధంగా ప్రారంభించారు. ఇందుకు అవసరమైన ప్రత్యేక శిలలను పవిత్రమైన గంగధార జలాలతో శుభ్రం చేశారు. చందనం అరగదీసే బేడా మండపాన్ని మామిడి తోరణాలతో అలంకరించి ఇక్కడ శిలలను ఏర్పాటు చేశారు. గతంలో అడివివరం గ్రామ మునసబు వంశీయులు తొలుత చందనం అరగదీత ప్రారంభించేవారు. కానీ సుమారు ఎనిమిదేళ్లుగా ఆ విధానానికి దేవాలయ అధికారులు స్వస్తి పలికి ప్రధానార్చకులతోనే చందనం అరగదీతను ప్రారంభిస్తున్నా రు. అర్చకులు చందనం చెక్కలకు పూజలు నిర్వహించి గంధం అరగదీతను సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు.

## 'సంగం సర్వర్లు హ్యాక్ అయ్యాయి : ఐటీ వింగ్

గుంటూరు : సంగం డెయిరీ సర్వర్లు హ్యాకింగ్ అయినట్లు సంస్థ ఐటీ వింగ్ గుర్తించింది. రోజువారీ కార్యకలాపాల డేటా హ్యాకింగ్కు గురైందని ఐటీ వింగ్ ఉద్యోగులు పసిగట్టారు. దీనిపై డెయిరీ ఐటీ వింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తక్షణమే పోలీసుల సోదాలు నిలిపివేయాలని సంగం సిబ్బంది డిమాండ్ చేశారు. సంస్థ సర్వర్ రూమ్ వద్దకు ఏసీబీ అధికారులతో పాటు పోలీసులు కూడా చేరుకున్నారు. సర్వర్లను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమయంలో సంస్థ ఉద్యోగులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కోర్టు ఆర్డర్స్ రాక ముందే సర్వర్లను తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని యాజమాన్యం ఆరోపించింది. అయితే తమకు కోర్టు నుంచి ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు రాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మరోవైపు సంగం డైయిరీ వద్దకు మీడియాకు అనుమతిని నిరాకరించారు. ప్రస్తుతం డైయిరీ తమ ఆధీనంలో ఉందని, మీడియా వాళ్లు ఇక్కడికి రావడానికి వీల్లేదని, వెళ్లిపోవాలని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.



# ఐ. టి.డి.ఏ పిఓ ను కె.జి.హెచ్ కోవిడ్ స్పెషల్ ఆఫిసర్ గా నియమించడం తగదు

పాడేరు ( విభారె) గిరిజన ప్రాంతాల్లో కోవిడ్ మహమ్మారి వ్యాప్తి తో రోగులు పెరుగుతుంటే సమర్ధవంతంగా వైద్యం అందించేందుకు సమన్వయం చేసే ఐ. టి.డి.ఏ పిఓ ను కె.జి.హెచ్ కోవిడ్ స్పెషల్ ఆఫీసర్ గా ప్రభుత్వం జారీ చేసిన నియామక ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు.పాడేరు ఐ. టి.డి.ఏ పరిధిలో సుమారు ఆరున్నర లక్షల మంది ప్రజలు ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోజు రోజుకు కోవిడ్ సెకండ్ హేవ్ చాలా వేగంగా వ్యాప్తి చెందింది.భౌగోళికంగా విస్తారంగా ఎక్కువ గ్రామాలు, రహదారి నిర్మాణం కూడ సక్రమంగా లేని,అంబులెన్స్ వేళ్ళని గ్రామాలు ఉన్నాయి.సీజనల్ జ్వరాలకే మెరుగైన వైద్యం అందని ద్రాక్ష . పాడేరు జిల్లా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసిన నేటికి మెరుగైన వైద్యం కోసం రోగులను విశాఖపట్నం తరలిస్తున్నారు.కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో రోగులకు వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రి లో వెంటిలేటర్ ఆపరేటర్ లేక రోజులు తరబడి నిరుపయోగంగా ఉంది.అధికారుల అసమర్ధత వల్ల10 వెంటిలేటర్ ను విశాఖపట్నం తరలించారు. పాడేరు,అరకులోయ కోవిడ్ క్వారెంట్ సెంటర్ల ఏర్పాటు చేసిన మౌలిక వసతులు సమకూర్చాలి. చింతపల్లి, ముంచింగ్ పుట్ ఏరియాల్లో కోవిడ్ విస్తరించిన నేటికి కోవిడ్ క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు చేయలేదు.అరకొరగా ఉన్న వైద్య సేవలు, ఆసుపత్రిలో,క్వారంటైన్ సెంటర్ల కొరవాడిన మౌలిక వసతులు, విస్తరిస్తున్న కోవిడ్ నుండి గిరిజనుల ప్రాణాలు కాపడవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో కోవిడ్ మరణాల పెరుగుతుంది.టెస్టు రిపోర్ట్ రాక రోగులు అయోమయంలో గిరిజనులు ఉన్నారు. ల పాడేరు కేంద్రగా ల్యాబ్ ఏర్పాటు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో ఇన్ని సమస్యలు ఉంటే గిరిజన ప్రాంతాల కోసం ప్రత్యేకంగా నియమించిన అధికారి పిఓను కె.జి.హెచ్ కోవిడ్ స్పెషల్ ఆఫీసర్ గా నియమించి గిరిజన ప్రాంత ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు.గిరిజన ప్రాంతాల్లో ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత, నిర్లక్ష్యం తగదు అన్నారు.

# కరోనా కట్టడికి తగు జాగ్రత్తలు తీసుకోండి

విశాఖపట్నం ( విభారె) పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామపంచాయతీ లో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా సర్పంచ్ చేపల మసేను ఆధ్వర్యంలో కరోనా నిర్మూలనకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలో ఎక్కడ పారిశుధ్యం లేకుండా డ్రెయినేజీ ల్లో ఉన్న పారిశుధ్య పూడికలను శుక్రవారం తొలగించడం జరిగింది, అలాగే డ్రైనేజి ల్లో బ్లీచింగ్ చల్లడం హైపో సోడియం క్లోరైడ్ పిచికారీ చేయడం జరిగింది,ఈ సందర్భంగా సర్పంచ్ చేపల మసేను మాట్లాడుతూ కరోనా మహమ్మారి పట్టణ ప్రాంతాలకు కాకుండా, గ్రామాల్లో కూడా కరోనా విజృంభిస్తున్న తరుణంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రతి

## తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను

ఒక్కరూ మాస్క్ ధరించాలని శానిటైజర్ తోటి చేతులను పరిశుభ్రంగా వాస్ చేసుకోవాలని,ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కర్ఫ్యూ ప్రకటించడం జరిగింది ఆ సమయంలో ఎవ్వరూ బయటకు రాకూడదని, అత్యవసరం అయితే తప్ప ఎవ్వరూ మీ ఇళ్ళల్లో నుండి బయటకు రా వద్దు ని ప్రజలకు అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చేపల దేవుడమ్మ, సురాడ ఎర్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు

తుగ్గలి ( విభారె) తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో సర్పంచ్ ఎండా చౌడప్ప ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.శుక్రవారం రోజున బొందిమడుగుల గ్రామం నందు గ్రామ సర్పంచ్ ఎండా చౌడప్ప ఆధ్వర్యంలో కోవిడ్ నిబంధనలను పాటిస్తూ సుమారు వందమంది ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షలు ముగిసిన అనంతరం పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ,మాస్కులను ధరించి, భౌతిక దూరాలను పాటిస్తూ మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి అల్లా ఆశీస్సులతో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా,కరోనా పూర్తిగా అంతరించి ప్రజలు సుఖశాంతులతో జీవించాలని మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎండా చౌడప్ప,ప్రతాప్,మహబూబ్ బాషా,మోహన్,ముస్లిం మత పెద్దలు,ముస్లిం సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజుకి ఘన నివాళి

## అల్లూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం

## దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి

పాడేరు ( విభారె) స్థానిక మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి జరిగింది.అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం లోనే కాకుండా గిరిజనులు దోపిడీకి గురవుతున్నా తరుణంలో గిరిజనుల పక్షాన నిలబడిన ఏకైక నాయకుడు అల్లూరి సీతారామరాజు అని గిరిజన హక్కు చట్టలు పటిష్టంగా అమలుకై పోరాటం చేసిన మహా యోధుడు అల్లూరి సీతారామరాజు అని దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు, అండిబా సర్పంచ్ తామర్ల సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఎంతో స్పూర్తిదయకం అని ఆయన స్పూర్తితో ప్రజలందరు ముందుకు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో త్రినాథ్, పండు తదితరులు పాల్గొన్నారు.

# కళ్ళవాపుకు నిముషాల్లో పరిష్కారం..



ఓపెన్ గా చెప్పాలంటే ఎవరైనా ఎక్కువగా నిద్రపోయినప్పుడు లేదా తక్కువ నిద్రతో లేచినప్పుడు కళ్ళ క్రింద వాపు కనిపిస్తుంది. దాని తర్వాత, విషయం ఏమిటంటే మీరు ఎప్పుడూ అలసిపోయినట్లు మరియు కళ్ళ క్రింద అనవసరమైన 'నల్లటి వలయాలతో' మేల్కొంటారు! మరి మీకు నాలాగే పరిస్థితి ఉందా? మీరు పఫర్ ఫిష్ వంటి ఉబ్బిన కళ్ళతో మేల్కొంటున్నారా? అలా అయితే, మీ సమస్యకు నిముషాల్లో పరిష్కారం దొరుకుతుంది! కళ్ళ క్రింద పఫ్నెస్ తొలగించడానికి వర్తించే ఉత్తమ మాస్క్ లు మీ కోసం ఇక్కడ సిద్ధంగా ఉన్నాయి. అవి ఏమిటో చూద్దాం. కంటి ఉబ్బు నుండి ఉపశమనం పొందే ఉత్తమ మాస్క్ లు.. వండర్ బ్యూటీ బ్యాగేజ్ క్లెయిమ్ గోల్డ్ ఐ మాస్క్ వండర్ బ్యూటీ బ్యాగేజ్ క్లెయిమ్ గోల్డ్ ఐ మాస్క్ ఇది మీ కళ్ళ క్రింద వాపు తొలగిస్తుంది మరియు కళ్ళ చుట్టూ ఉన్న నల్లటి వ ృత్తాలను తొలగిస్తుంది. ఇది కళ్ళ క్రింద చాలా సున్నితమైన చర్మంలో తేమను నిలుపుకోవటానికి సహాయపడుతుంది. ఇందులో ఉన్న అంశాలు వేడిని నిలుపుకుంటాయి మరియు కొవ్వు త్వరగా ఆవిరైపోకుండా హైడ్రేషన్ను నియంత్రించడంలో సహాయపడతాయి. కళ్లకు ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మం సాగే గుణం తగ్గించడానికి కూడా సహాయపడుతుంది. హైలురోనిక్ ఆమ్లం, కలబంద జెల్ మరియు లావెండర్ నూనెను కలిగి ఉంటుంది. సున్నితంగా పనిచేస్తుంది. నీటిని నిలుపుకుంటుంది. కంటి అత్యవసర మరమ్మత్తుకు ఈ మాస్క్ కంటి అత్యవసర మరమ్మత్తుకు ఈ మాస్క్ రోజ్ వాటర్ కలిగి ఉన్న ఈ ముసుగు, మీరు రాత్రి కళ్ళు మూసుకోలేక పోయినప్పటికీ, ఇది కళ్ళ క్రింద మంటను కలిగించదని హామీ ఇస్తుంది. ఈ ముసుగు మొదటి ఉపయోగం మీద కళ్ళ క్రింద ఉబ్బిన రూపాన్ని తగ్గిస్తుంది. కళ్ళ కింద చర్మంలో తేమను నిలుపుకోవడం ద్వారా ఇవి కళ్ళకు చైతన్యం నింపుతాయి. హైఅలురోనిక్ ఆమ్లం ఉంటుంది. కళ్ళ చుట్టూ ముడతలు మరియు నల్లని వ ృత్తాలు తొలగిస్తుంది. ప్రయాణించేటప్పుడు ఈ మాస్క్ అనువైనదని చర్మవ్యాధి నిపుణుడు ధ ృవీకరించారు. బ్రైట్ ఐ హైడ్రేటింగ్ మాస్క్ బ్రైట్ ఐ హైడ్రేటింగ్ మాస్క్ ఇది ప్రత్యేకమైన 3-యాక్టివ్ ఇన్గ్రేడియంట్ ఫార్ములాను కలిగి ఉంది, ఇది కళ్ళ క్రింద పఫ్నెస్ను తొలగిస్తుంది మరియు చర్మాన్ని మ ృదువుగా చేస్తుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి సహాయపడుతుంది మరియు కళ్ళ క్రింద చర్మాన్ని ప్రేరేపిస్తుంది. అదనంగా, ఈ మాస్క్ ఈ ప్రాంతంపై ముడతలు రాకుండా ఉండటానికి చాలా ఉపయోగపడుతుంది మరియు చర్మం పాతదిగా కనిపించదు. డబుల్ స్వీటెనర్లను మరియు హైఅలురోనిక్ ఆమ్లాన్ని కలిగి ఉంటుంది. న్యూరోపెప్టైడ్స్ ఉంటాయి. చర్మాన్ని ప్రకాశవంతం చేసే అర్బుటిన్ ఉంటుంది. షిసిడో బెనిఫిట్స్ ఎక్స్ప్రెస్ స్మూతీంగ్ ఐ మాస్క్ షిసిడో బెనిఫిట్స్ ఎక్స్ప్రెస్ స్మూతీంగ్ ఐ మాస్క్ చర్మం వ ృద్ధాప్యాన్ని నివారించడంలో రెటినోల్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మీరు దీన్ని ఇంకా వర్తించకపోతే, ఈ మాస్క్ ను ప్రయత్నించండి. షిసిడో ఈ ఉత్పత్తి మీ కళ్ళ వాపును మారుస్తుంది మరియు చర్మంపై ముడుతలను తొలగిస్తుంది. ఇది చర్మం నాణ్యత మరియు మ ృదుత్వాన్ని మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుంది. రెటినోల్ కలిగి ఉంటుంది. 15 నిమిషాల్లో కళ్ళ కింద వాపు మరియు మచ్చలను తొలగిస్తుంది. చర్మవ్యాధి నిపుణులచే ధ ృవీకరించబడింది. నేత్ర వైద్య నిపుణులు ధ ృవీకరించారు. ఎర్నో లాస్లో మల్టీ టాస్క్ ఐ సీరం మాస్క్ అతను ఒక నెలకి రూ. 1,800,000 ఎలా సంపాదిస్తాడో చూడండి! రూ. 10 లక్షల వరకు రుణం పొందండి, తక్షణ ఆమోదం. ఇప్పుడు అప్లై చేయండి! %హాశ్ఖుత్ఖుజూ% ఎర్నో లాస్లో మల్టీ టాస్క్ ఐ సీరం మాస్క్ ఎర్నో లాస్లో ఉత్పత్తుల గురించి గొప్పదనం ఏమిటంటే అవి బొటానికల్స్ కలిగి ఉన్నందున అవి చాలా త్వరగా ఫలితాలను ఇస్తాయి. ఈ హైడ్రోజెల్ మాస్క్ మీ కళ్ళ అలసట నుండి ఉపశమనం కలిగిస్తుంది. కళ్ళ చుట్టూ నల్ల మచ్చలు మరియు మంటలను తొలగిస్తుంది మరియు కళ్ళకు ప్రకాశాన్ని ఇస్తుంది. పారాబెన్ లేదు. బ్లాక్ హెడ్స్ మరియు మొటిమలకు కారణం కాదు. చర్మ అసౌకర్యాన్ని కలిగించదు. చాంటెకైల్ గోల్డ్ ఎనర్జైజింగ్ ఐ రికవరీ మాస్క్ చాంటెకైల్ గోల్డ్ ఎనర్జైజింగ్ ఐ రికవరీ మాస్క్ కంటికి అసౌకర్యంగా ఉన్నప్పుడు చల్లబరచడానికి ఇదే మార్గం. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది మరియు కంటి మంటను తొలగిస్తుంది, తద్వారా కంటిని మేల్కొల్పుతుంది. కళ్ళ కింద వర్తించే ఉత్తమ ముసుగు ఇది కన్నీళ్లకు కారణం కాదు. చర్మపు ముడుతలను తగ్గిస్తుంది. పారాబెన్ ఉండదు. ఇథిలేట్, సతేలేట్, మినరల్ ఆయిల్ మరియు డిటర్జెంట్ నుండి ఉచితం. అమోరాకే టైమ్ టార్గెటెడ్ ఐ మాస్క్ అమోరాకే టైమ్ టార్గెటెడ్ ఐ మాస్క్ ఈ స్ట్రిప్స్ ముక్కుపై ఉపయోగించిన ఆకారంలో సమానంగా ఉంటాయి మరియు కళ్ళ క్రింద, కనుబొమ్మలు మరియు కంటి మధ్య, ఏ ప్రదేశంలోనైనా అతికించవచ్చు. గ్రీన్ టీలో నీరు మరియు యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి కంటి మంటను తగ్గించడానికి మరియు చర్మాన్ని యవ్వనంగా ఉంచడానికి సహాయపడతాయి. శరీరంలోని ఏ భాగానైనా ఉపయోగించవచ్చు.

## ఐపీఎల్ కామెంటరీ ఫీజును విరాళంగా ఇచ్చిన మాజీ క్రికెటర్

కోల్కతా: కరోనా బాధితులను ఆదుకునేందుకు పలువురు క్రికెటర్లు ముందుకు వస్తూనే ఉన్నారు. కొవిడ్పై పోరాటానికి సహాయ పడేందుకు భారత ఆటగాళు తమవంతు సాయాన్ని ప్రకటిస్తున్నారు. తాజాగా భారత మాజీ ఆల్రౌండర్ లక్ష్మీ రతన్ శుక్లా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) కామెంటరీ ద్వారా వచ్చిన మొత్తం జీతాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చాడు.కరోనా కారణంగా ఐపీఎల్ 2021 నిరవధికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే.14వ సీజన్లో శుక్లా బెంగాలీ కామెంటరీ బృందంలో ఉన్నాడు. కొవిడ్ సెకండ్ వేవ్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకునేందుకు తనవంతుగా చిరుసాయాన్ని అందిస్తున్నట్లు ట్వీట్ చేశాడు. భారత్ తరఫున 3 వన్డేలకు ప్రాతినిధ్యం వహించిన రతన్..137 ఫస్ట్ క్లాస్ మ్యాచ్లు ఆడాడు. ఐపీఎల్లో కోల్కతా నైట్రైడర్స్ కొన్ని మ్యాచ్లు ఆడాడు. ఈ ఏడాది ఆరంభంలో రాజకీయాల నుంచి తప్పుకున్న శుక్లా అంతకుముందు 2016 నుంచి 2021 వరకు స్పోర్ట్స్, యువజన వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. హౌరా ఉత్తర నియోజకవర్గం నుంచి టీఎంసీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు.

# స్టైలిష్ స్టార్ తో ట్రెండింగ్ డైరెక్టర్ సినిమా..?



టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం సినిమాలపరంగా స్పీడ్ పెంచినట్లే అనిపిస్తుంది. ఎందుకంటే ఇంకా పుష్ప సినిమా పూర్తి కానేలేదు. అప్పుడే తదుపరి సినిమాల గురించి ఇండస్ట్రీలో వార్తలు హల్చల్ చేస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ - క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో పుష్ప అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా వైడ్ క్రేజ్ సంపాదించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమా దేశవ్యాప్తంగా ఐదు భాషల్లో రిలీజ్ కాబోతుంది. అలాగే సినిమాను ఈ ఏడాది రిలీజ్ చేస్తామని మేకర్స్ రిలీజ్ డేట్ అయితే వదిలారు. కానీ ప్రస్తుతం సినిమాలు కంప్లీట్ అవ్వడంతో పాటు విడుదలయ్యే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.అయితే అల్లు అర్జున్ పుష్ప సినిమా తర్వాత ఏ డైరెక్టర్ తో సినిమా చేస్తాడు.. అనేది ప్రశ్న. ఇప్పటివరకు ఈ ప్రశ్నకు సమాధానం లభించలేదు. కానీ పలువురు స్టార్ డైరెక్టర్స్ పేర్లు మాత్రం బాగానే వినిపిస్తున్నాయి. ఇప్పటికే సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పేరు వినిపించగా.. ఈ మధ్యన తమిళ స్టార్ డైరెక్టర్ మురుగదాస్ పేరు తెరమీదకి వచ్చింది. కానీ ఇప్పుడు లేటెస్ట్ గా ట్రెండింగ్ లో ఉన్నటువంటి పేరు వంశీ పైడిపల్లి. మహేష్ బాబుతో మహర్షి సినిమా తర్వాత వంశీ నుండి మరో సినిమా రాలేదు. వంశీ ప్రస్తుతం కోలీవుడ్ హీరోలతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తుంది. కానీ ఇప్పుడు మళ్లీ అల్లు అర్జున్ తో వంశీ సినిమా ఉండబోతుందని గాసిప్ టాలీవుడ్ సర్కిల్స్ లో వైరల్ అవుతోంది. మరి నిజంగానే వంశీతో అల్లు అర్జున్ సినిమా ఉంటుందా లేదా అనేది తెలియాలంటే ఇంకొంత కాలం వెయిట్ చేయకతప్పదు.

# కమర్షియల్ డైరెక్టర్ స్కిప్ట్ను డెవలప్ చేస్తున్నాడా..?

ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ సినిమాలను తెరకెక్కించే అతికొద్ది మందిలో దర్శకుడు మారుతీ ఒకరు. మారుతీ తెరకెక్కించే ప్రతీ సినిమాలో మినిమం కామెడీ గ్యారంటీ అన్నట్లుగా ఉంటాయి సినిమాలు. మొదటి నుండి కూడా ఈ దర్శకుడు ఫ్యామిలీ ఆడియన్స్ దృష్టిలో పెట్టుకొని తెరకెక్కిస్తూ వస్తున్నాడు. ఇప్పటివరకు టాలీవుడ్ ఇండస్ట్రీలో ట్రెండింగ్ లో ఉన్నటువంటి యంగ్ హీరోస్ అందరితో మారుతీ సినిమాలు చేసాడు. చివరిగా సాయిధరమ్ తేజ్ హీరోగా ‹ప్రతిరోజూ పండగే› అనే సినిమాతో డీసెంట్ హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం తదుపరి సినిమా పక్కా కమర్షియల్ స్క్రిప్ట్ పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం కరోనా వైరస్ మహమ్మారి కారణంగా మారుతి విరామంలో ఉన్నాడు.టాలీవుడ్ హ్యాండ్సమ్ హీరో గోపీచంద్ హీరోగా మారుతీ ‹పక్కా కమర్షియల్› సినిమా రూపొందిస్తున్నాడు. ఫస్ట్ సిట్టింగ్ లోనే గోపీచంద్ మారుతీ స్క్రిప్ట్ కు ఇంప్రెస్స్ అయిపోయి వెంటనే సినిమాను ఓకే చేసాడు. ఈ సినిమాకు ‹పక్కా కమర్షియల్› అనే టైటిల్ తో సినిమా కొంచం అటెన్షన్ క్రియేట్ చేసాడు మారుతీ. ఫుల్ లెన్త్ ఎంటర్టైనర్ గా తెరకెక్కనున్న ఈ సినిమాలో హీరో గోపీచంద్ న్యాయవాదిగా నటించనున్నాడు. అయితే కరోనా మహమ్మారి కారణంగా అందరూ ఇంటిపట్టునే ఉండటంతో మారుతీ ప్రస్తుతం పక్కా కమర్షియల్ స్క్రిప్ట్ డెవలప్ చేస్తున్నట్లు సమాచారం. మారుతీ సినిమా అంటే ప్రేక్షకులలో మినిమం అంచనాలు ఉంటాయి.. మరి గోపీచంద్ తో ఎలాంటి ఫన్ క్రియేట్ చేస్తాడో చూడాలి. జీఏ2 పిక్చర్స్ యూవి క్రియేషన్స్ సంయుక్తంగా ఈ ‹పక్కా కమర్షియల్› ఎంటర్టైనర్ ను నిర్మించనున్నాయి. ఓవైపు గోపీచంద్ హీరోగా నటించిన స్పోర్ట్స్ మూవీ సీటిమార్ విడుదలకి సిద్ధంగా ఉంది.



# శంకర్-చరణ్ ప్రాజెక్ట్ లో ఇతర ఇండస్ట్రీల స్టార్ హీరోలు..?

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ - మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్లో ఓ పాన్ ఇండియా మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు - శిరీష్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి రోజూ ఏదొక న్యూస్ వస్తోంది. పాన్ ఇండియా లెవల్ లో రూపొందే ఈ సినిమాలో ఓ కీలక పాత్ర కోసం ఐదు ప్రధాన భాషలకి చెందిన ఐదుగురు స్టార్ హీరోలను నటింప చేయాలని మేకర్స్ భావిస్తున్నారని తాజాగా ఓ వార్త ఫిలిం సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.ఈ నేపథ్యంలో ‹ =జ15‹ కన్నడ వెర్షన్ కి సంబంధించి కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ ని ఆ రోల్ కోసం ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ‹రక్త చరిత్ర‹ ‹ఈగ‹ ‹బాహుబలి‹ ‹సైరా‹ వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన సుదీప్.. ఇప్పుడు చరణ్ సినిమాలో నటించంచనున్నారని అంటున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందట. అలానే అదే పాత్ర కోసం తమిళంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి.. హిందీలో కండల వీరుడు సల్మాన్ ఖాన్ లను సంప్రదిస్తున్నారని టాక్ నడుస్తోంది. తెలుగు వెర్షన్ లో మెగా ఫ్యామిలీకి చెందిన హీరో నటిస్తారని అంటున్నారు. ఈ వార్తల్లో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.





## అందం అంటే అమైరా అనేంతగా ఆ హొయలు

సందీప్ కిషన్ సరసన కథానాయికగా నటించిన అమైరా దస్తూర్ ఆ తర్వాత బాలీవుడ్ లో కొన్ని అవకాశాలు అందుకుంది. అక్కడ ఇమ్రాన్ హస్మి.. ప్రతీక్ బబ్బర్ లాంటి స్టార్ల సరసన నటించింది ఈ భామ. ప్రస్తుతం ఓ మూడు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఊడి ఊది ఉజికానుమ్ ..కాధలై తేడి నిత్య నంద అనే రెండు తమిళ చిత్రాల్లో నటిస్తోంది. పిల్ ఫర్ సింగ్ అనే హిందీ చిత్రంలోనూ నాయికగా నటిస్తోంది.ఇటీవలే భగీరా అనే చిత్రంలోనూ అవకాశం అందుకుంది. ఈ సినిమాలో ప్రభుదేవా ఐదు గెటప్పులతో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఇందులో అమీరా దస్తూర్ పాత్ర ఆసక్తికరంగా ఉండనుందిట. ఇంతకుముందు రిలీజ్ చేసిన భగీరా టీజర్ ఆసక్తిని పెంచింది.అమైరా ఇటీవల సోషల్ మీడియాల్లో ఇతర నాయికలకు ధీటుగా వరుస ఎ్ౌ టో ష ూ ట్ల తో విరుచుకుపడుతోంది. ఈ బ్యూటీ పోస్టులు అభిమానుల్లో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా ఓ పబ్లిక్ పార్క్ లో తన క్రూతో ఫోటోషూట్లో పాల్గొంది అమైరా. ఈ వీడియోని సోషల్ మీడియాల్లో షేర్ చేయగా అభిమానుల్లో వైరల్ గా మారుతోంది. అమైరా స్పెషల్ లెహెంగా లుక్ ఆకట్టుకుంటోంది.






EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190